ప్రజాశక్తి
స్నేహ
ఆదివారం అనుబంధం
మే 07, 2017

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell. 9849070838

నవ్వవయ్యా బాబూ..!



అమ్మే ఆధారం

తల్లి పాత్ర ఆధారంగా వచ్చిన చిత్రాలు కొన్నే కావచ్చు. కానీ అవి ఎప్పటికీ గుర్తుంచుకునేంత ప్రభావాన్ని చూపాయి. 'మదర్ ఇండియా'నే తీసుకుందాం. దశాబ్దాలు గడుస్తున్నా ఆ చిత్రం అందులో నందా పాత్ర గురించి ఇప్పటికీ విమర్శకుల చర్చ నడుస్తూనే ఉంటుంది. భారత్‌ను ఆస్కార్ వరకు తీసుకెళ్లిన ఘనత ఆ చిత్రానిది. ఆస్కార్ వచ్చినా రాకపోయినా 'మదర్ ఇండియా'తోనే భారత సినీ పరిశ్రమను అంతర్జాతీయంగా గుర్తిస్తుంటారు. ఈ తల్లుల దినోత్సవం సందర్భంగాను శ్రీదేవిది 'మామ్' చిత్రం రాబోతోంది. 'ఇంగ్లిష్ వింగ్లిష్'తో రీ-ఎంట్రీ ఇచ్చినా 'మామ్' చిత్రం మీదే అంచనాలన్నీ ఉన్నాయి. ఆమె రెండో ఇన్నింగ్స్‌కు ఇదో బ్రేక్ అవుతుందేమో. ఇలాగే రెండో ఇన్నింగ్స్‌ను మలుపు తీసుకుంది రవీనా టాండన్. ఈ మధ్యే విడుదలైన 'మాతృ' చిత్రం తల్లి పాత్ర కథ చుట్టుతా తిరిగేదే. 'మాతృ' చిత్రంలో తన కూతురితోపాటు సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న హింసాత్మక పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు ముందుకొచ్చిన తల్లి పాత్రలో అద్భుత నటన కనబరిచింది రవీనా టాండన్. ఈ చిత్రాల పేర్లను చూస్తే మన తెలుగు చిత్రాలైన 'మాతృ దేవో భవ', 'అమ్మ రాజీనామా', 'అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి', 'అమ్మ చెప్పింది' గుర్తుకు వస్తాయి. ఇవి కూడా తల్లి పాత్రను అద్భుతంగా కళ్లకు కట్టినవే. టైటిల్‌లో అమ్మ అనే మాట లేకున్నా చాలా చిత్రాలు ఆమె కథ చుట్టుతా సాగినవెన్నో.



స్ఫూర్తి

మౌంట్ సిన్హా

పర్వతాల్లో ఎవరెస్ట్‌పేరు తెలీని వారుండరు. మరి మౌంట్ సిన్హా పేరెప్పుడైనా విన్నారా?? ఇదేదో భారతీయుడి పేరులా వుందనుకుంటున్నారా. అవును మీరు విన్నది నిజమే. అంటార్కిటికా లో అతి పెద్ద మంచు పర్వతం ఎమ్‌సి డోనాల్డ్ హైట్స్. కేప్ బర్డ్స్, మారిస్ హెడ్ మధ్య ప్రాంతంలో 3300 అడుగుల ఎత్తున వుండే ఈ పర్వతాలు 65 కి.మీ మేర దట్టమైన మంచుతో కప్పబడి వుంటాయి. సరిగ్గా వాటికి దక్షిణ భాగంలో వుండే మరో పర్వతం పేరే మౌంట్ సిన్హా. 991 అడుగుల ఎత్తున వుండే ఓ మంచు పర్వతం పేరది. అమెరికా ప్రభుత్వం అంటార్కిటికాలోని పర్వతానికి భారత సంతతికి చెందిన ఓ జీవశాస్త్ర పరిశోధకుడి పేరుని ఖరారు చేయడానికి కారణాలేంటో మీరూ తెలుసుకోండి.

అది నవంబర్ 17 2012. సిన్హా తన అంటార్కిటికా పర్యటనలో జట్టుకి నేతృత్వం వహించిన వ్యక్తి మరణంపై కొన్ని విషయాలని రాస్తున్నాడు. దానికి సంబంధించిన విషయాలని వికీపీడియాలో శోధిస్తున్న తనకి ఎరిక్సన్ బ్లఫ్స్‌కి ఈశాన్య దిశలో ఉన్న పర్వతాలపై మౌట్ సిన్హా అనే పేరు కనిపించింది. ఆ పర్వతాలకి తన పేరు పెట్టారనే విషయం అప్పటి దాకా సిన్హాకి కూడా తెలీదు. ఇది తనని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంతకీ సిన్హా ఎవరంటే.....అకౌరి సిన్హా పుట్టి పెరిగింది బీహార్‌లోని బక్సర్‌కి దగ్గరలో ఉన్న చురనమాన్ పూర్ గ్రామంలో. అలహాబాద్ యూనివర్సిటీ నుంచి బిఎస్‌సిలో డిగ్రీ పూర్తిచేశారు. పాట్నా యూనివర్సిటీలో జీవశాస్త్రంలో ఎమ్ఎస్‌సి చేసి జలంధర్‌లోని రాంచీ కాలేజీలో జీవశాస్త్ర అధ్యాపకులుగా ఉద్యోగం మొదలు పెట్టాడు. రెండేళ్లు అదే వృత్తిలో కొనసాగిన సిన్హాకి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరీలో పిహెచ్‌డి చేసే అవకాశం లభించింది. ఈ బీహార్ వాసి మకాం కొలంబియాకి మారింది. జీవశ్రాస్తంలో పిహెచ్‌డి చేస్తున్న తనకి సముద్ర జీవజాతులపై అసక్తి పెరిగింది. పిహెచ్‌డి పూర్తిచేసుకుని ఆదే యూనివర్సిటీలో ఫ్యాకల్టీగా చేరాడు సిన్హా. 1963లో జీవశాస్త్ర ప్రొఫెసర్‌గా కెరీర్‌ని ప్రారంభించిన సిన్హా ప్రమాదకర స్థితికి చేరుతున్న సముద్ర జీవాలపై అధ్యయనం మొదలు పెట్టాడు. అంటార్కిటికా ప్రాంతంలో అంతరించి పోతున్న జంతుజాతుల పరిరక్షణ దిశగా తర అధ్యయనం మొదలయ్యింది. ఆ సమయంలోనే అంటార్కిటికా సముద్ర జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ఒక శాస్త్రవేత్తల బృందం కూడా పనిచేస్తోంది. సముద్ర జీవాల సంఖ్యని పెంచేందుకు కృషిచేస్తున్న సిన్హా గురించి తెలుసుకున్న యుఎస్ సైన్స్ ఫౌండేషన్ అంటార్కిటికా ప్రాంతంలోని సీల్స్ సంఖ్యని పెంచేందుకు శాస్త్రవేత్తలు నిర్వహిస్తున్న పరిశోధనల్లో భాగమయ్యే అవకాశాన్ని కల్పించింది. అలా సముద్రజీవాల పరిరక్షణకి కృషిచేస్తున్న శాస్త్రవేత్తల బృదంలో పనిచేసే అవకాశం 1972, 1974 రెండు సార్లు సిన్హాకి దక్కింది. అక్కడి సముద్ర జీవాలపై పరిశోధన మొదలయ్యింది. అడుగేయడమే సాధ్యం కాని ఆ మంచుప్రాంతంలో హెలీకాప్టర్ ద్వారా చేరుకుంటూ పరిశోధనలు జరిగాయి. ప్రకృతి అందాలతోపాటు తీవ్ర మంచులో అత్యంత ప్రతికూల వాతావరణంలో అక్కడ జంతుజాతుల మనుగడ సాగిస్తుండటం సిన్హాని ఆశ్చర్యపరిచింది. తీరప్రాంతాల్లో పహారాకి వినియోగించే కోస్ట్ గార్డ్ కట్టర్లు, సౌత్ విండ్ గ్లేషియర్ నౌకల సాయంతో 22 వారాలపాటు పరిశోధనలు నిర్వహించింది సిన్హా బృందం. ఆ ప్రాంతానికి దగ్గరలో కొన్ని పర్వత శ్రేణులని యుఎస్ జియెలాజికల్ సర్వే(యుఎస్‌జిసి), యుఎస్ నావీ ఎయిర్ ఫొటోగ్రాఫ్స్ 1959-65 మధ్య గుర్తించాయి. అమెరికాలోని ఎత్తైన పర్వతాల్లో 2914వ స్థానాన్ని దక్కించుకున్న ఆ పర్వతాల వద్ద వున్న బెల్లింగ్ షౌజన్, అముండ్సెన్ సముద్రాల్లో నివసించే సొరచేపలు, పక్షులు, సీల్స్ మనుగడపై సిన్హా పరిశోధనలు నిర్వహించాడు. పర్యావరణ మార్పు కారణంగా అక్కడ పెద్ద ఎత్తున మంచు కరిగిపోవడం ఆ జీవజాతులకి ప్రమాదకరంగా మారిందనే విషయాన్ని గమనించిన సిన్హా వాటి పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టాడు. అక్కడ అంతరించి పోతున్న జీవాలుగా గుర్తించబడిన సీల్స్ సంఖ్యని పెంచేందుకు తను చేసిన ప్రయోగాలు మంచి ఫలితాలనిచ్చాయి. తర్వాత అమెరికాలోని వెటరన్ ఎఫైర్స్ మెడికల్ సెంటర్ ఇన్ మిన్నెపొలిస్ తోపాటు జన్యు శాస్త్రం, జీవశాస్త్రం, జీవకణ అభివృ ద్ధి, యూరాలజీ విభాగాల్లో ప్రొఫెసర్‌గా పని చేశారు సిన్హా, సముద్రజీవాల పరిరక్షణ కోసం తను చేసిన నిర్విరామ కృషికిగాను ఎమ్‌సి డొనాల్డ్ హైట్స్‌కి దక్షిణ భాగంలో వుండే పర్వతాలకి యుఎస్ ఆకన్, యుఎస్ జియాలజికల్ సర్వే ఎడ్వైజరీ కమిటీ సిన్హా పేరుని ఆమోదించాయి. అలా సిన్హా పేరు కొండంత ఎత్తుకెదిగినా చాలా కాలం వరకు ఆ విషయం తనకి తెలీదు. ఓ పరిశోధనలో భాగంగా గూగూల్ సెర్చి ద్వారానే ఈ నిజాన్ని తెలుసుకున్నాడు సిన్హా. బోధనలో పాతికేళ్ల అనుభ వాన్ని గడించిన ఈ ప్రొఫెసర్ తన బృందంతో కలిసి ప్రొస్టేట్ క్యాన్సర్ కణాల లక్షణాలు వాటి తీవ్రత, విస్తరణ ప్రభావంపై అధ్యయనం మొదలు పెట్టాడు. సిన్హా చేస్తున్న ఈ కృషి మరో మంచి ఫలితాన్ని ఇవ్వాలని ఆసిద్దాం.

-శర్వాణి

ఇండెక్స్

విను్త్నం.................3
మార్పుకోసం

స్టార్........4
దృశ్య మాంత్రికుడు

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం............... 10
నిద్రా వ్యాయామం

విజేత..............11
బామ్మ పరుగు బంగారం

కవిత్వమ్...............14
నీ కనురెప్పల మాటున...

తెలుసా 15
ప్రాణ బంధువు

నవ్వవయ్యా బాబూ..!

అట్టమీది కథ...6

ప్రత్యేకం - 12

తొలి రజతోత్సవ చిత్రం

కథ 16
వలస బతుకు

సందర్భం...........19
పౌర కేఫ్‌ల్లో ఓ రెండు గంటలు

కొత్త పుస్తకాలు...............20
పల్లె పాటల 'దణి'

రుచి............21
చాక్లెట్ లస్సీ

బాల నేస్తాలు............22
బొమ్మల టోపీలు

పద వికాసం........24

కనువిప్పు

ఇద్దరు పచ్చని మిత్రులు కథనం కదిలించింది. ఆలోజింపచేసింది. చైనాలో ఏడాది సాధ్యశంగా ఉన్న యే నదీ పరీవాహక ప్రాంతాన్ని 12 వేల చెట్లు నాటి అందమైన అడవిగా మార్చిన వెంకి, హైక్సియాలు ప్రపంచానికే ఆదర్శప్రాయులు. కంటి చూపులేని హైక్సియా, రెండు చేతులు లేని వెంకి ఇద్దరూ కలిసి ఈ అద్భుతాన్ని సాధించటం ఆశ్చర్యపరిచింది. గోతులు తవ్వి మొక్కలు నాటటం, చెట్లు ఎక్కి శబ్దాల ద్వారా కొమ్మలు నరకటం, ఒకరిపై ఒకరు ఎక్కి నదీప్రవాహాన్ని దాటటం ఇవన్నీ మానవమాత్రులు చేసే పనులేనా అని అనిపించింది. అవయవాలు అన్నీ ఉన్న వాళ్లు చేయలేని పనిని అవయవాలు లేని వీరు చేసి చూపించడం సభ్య సమాజానికి కనువిప్పే. పర్యావరణానికి ఎంతో మేలు చేస్తున్న ఈ ఇద్దరు మిత్రుల కృషికి వందనం అభివందనం.

-మంకు శ్రీను, కొప్పర్రు.

దేవదాసు మైమరిపించింది

23-4-2017 స్నేహ సంచికలో వచ్చిన దేవదాసు చిత్ర రాజము గురించి వివరించిన కథాకథనం నన్ను మైమరిపించింది. నిజంగా తాగుబోతులు కూడా ఆ రీతిలో వుండరనిపించే సరళిలో అసలుసిసలైన తాగుబోతుగా ఆ పాత్రలో లీనమై నటించారు అక్కినేని. ఒకరిని మించి మరొకరు నువ్వానేనా అనే రీతిలో పోటీ పడి వారి పాత్రలో లీనమై చేసిన నటన ప్రేక్షకుల మనసు హత్తుకుంది. ఆ రోజుల్లో హాల్లో దేవదాసు చిత్రం చూస్తున్న ప్రేక్షకుల్లో చరమాకంలోని సీన్‌ను చూసి ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. అందులో సావిత్రి నటన పరాకాష్టకి చేరుకుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. రంగారావు, సిఎస్ ఆర్ ఆంజనేయులు, పేకేటి శివరామ్ వారి పాత్రలకు న్యాయం చేశారు. సుబ్బరామయ్య గారి పాటలు బహుశా పదికాలాలపాటు మన చెవుల్లో మారుమోగుతుంటాయి. దొరస్వామిగారు ఏ చిత్రాన్నయినా అవలీలగా పండిస్తారు.

-కై.ప నాగరాజు, అనంతపురం

ఆ పుస్తకం 'ఈ' ట్యాబ్లెట్

సుమేరియన్ల మట్టి ట్యాబ్లెట్ల నుంచి నేటి ట్యాబ్‌ల వరకు పుస్తకాల ప్రస్థానాన్ని కళ్లకుకట్టినట్టు చేసింది ఈ వారం అట్టమీది కథ. అలనాటి చిత్ర రాజమకుటం దేవదాసు చదివించింది. కారెన్ తెగ పొడవు మెడ తెగగా గుర్తించబడడం, వారి ఆహార్యం ఆశ్చర్యపరిచాయి. వీధి చిత్రాలే అయినా ఓ మంచి ఆలోచనని కలిగించేలా తీర్చిదిద్దిన ఆ చిత్రాలన్నీ ఆకట్టుకున్నాయి. తీగ జలపాతం, ఆ పుస్తకం ఈ బుక్, కొత్త పొద్దు కథ, ఆన్‌లైన్‌లో పందం పుల్ల, శునకాలకు హిమక్రీములు, నటన తెలుసు, ఇద్దరు పచ్చని మిత్రులు, ఓ ట్యాక్సీ వాలా కథ బాగున్నాయి. నవ్వుల్ పువ్వుల్ నవ్వు తెప్పించాయి.

భార్గవి, విజయవాడ.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

పారిశ్రామిక విప్లవం తర్వాత అన్ని రంగాల్లో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ఆ ప్రభావం వ్యవసాయ రంగాన్నీ తాకింది. నాట్లు వేసే దశ నుంచి పంట చేతికందే వరకు వివిధ దశల్లో పరికరాలు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో రైతులు సాంకేతిక అభివృద్ధితో ముందడుగేస్తుంటే ఆర్థిక వెనుకబాటు వల్ల ఇప్పటికీ కొందరు రైతులు వ్యవసాయ పరికరాలని ఉపయోగించలేకపోతున్నారు. అలాంటి పరిస్థితుల్లో మార్పు కోసం ప్రభుత్వ ఉద్యోగాన్ని మానుకుని ఐడిఈఐ సంస్థ ద్వారా రైతుల ఆర్థికస్థితిలో మార్పుకి కృషిచేస్తున్నాడు అమితాభ సదంగి.

మార్పు కోసం

అమితాభ సదంగి పుట్టిపెరిగింది ఒడిశా గాలెరీ గ్రామంలోని ఓ నిరుపేద కుటుంబం. తన బాల్యం అంతా పేదరికంలోనే గడిచింది. కుటుంబంలో అందరూ రెండు పూటలా భోజనం చేసిన దాఖలాలూ లేవు. చిన్న వయసులోనే కుటుంబ బాధ్యత మీదేసుకున్నాడు సదంగి. వివిధ పనుల్లో కొనసాగుతూ డబ్బు సంపాదించేవాడు. పనితో పాటు చదువుని కూడా కొనసాగించాడు సదంగి. పేపర్ బాయ్‌గా పనిచేసి వచ్చిన డబ్బుని స్కూల్ కాలేజ్ చదువుకి ఉపయోగించేవాడు. డిగ్రీ పూర్తిచేసిన సదంగికి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. అయితే ఆ ఉద్యోగంలో తను ఎక్కువ కాలం కొనసాగ లేదు. 1991లో సోషల్ డెవలప్‌మెంట్, లా కోర్సుల్లో డిగ్రీ పూర్తిచేసిన తర్వాత ఉద్యోగానికి ఫుల్‌స్టాప్ పెట్టాడు. అలా ప్రభుత్వ ఉద్యోగం మానుకోడానికి కారణం లేకపోలేదు. వ్యవసాయాధారిత దేశంలో సాంకేతిక మార్పులు చోటుచేసుకున్నా ఆ మార్పులు పేద రైతుకి అందకుండా పోతున్నాయి. అర్థిక వెనుకబాటు ద్వారా సాంకేతికతని ఉపయోగించుకోలేపోతున్న రైతులంతా మరింత పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారనే వాస్తవాలన్నీ సోషల్ డెవలప్ మెంట్ డిగ్రీ చదువుతున్నప్పుడు తెలుసుకున్నాడు. రోజు కూలితో కుటుంబం మొత్తం పొట్టనింపుకునే రైతుకూలీల జీవితాలు తనని కదిలించాయి. అలాంటి రైతుల కోసం తక్కువ ధరకి లభించే పరికరాలని తయారుచేయాలనే ఆలోచనతో ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా(ఐడిఈఐ) సంస్థని మొదలు పెట్టాడు. బంగ్లాదేశ్‌లో రైతులు ఉపయోగిస్తున్న టెడిల్ పంపుల గురించి తెలుసుకున్నాడు సదంగి. పొలానికి నీరందించే అతి తేలికైన సాధనం ఇది. భూమి నుండి నీటిని తీసే ఈ పరికరాన్ని ఉపయోగించేది కాలితోనే. వెదురు కర్రలకి అమర్చే టెడెల్ పంపుని ఏ వయసు వారైనా తేలికగా ఉపయోగించొచ్చు. ఇందులో అమర్చిన రెండు సిలిండర్లలో దాదాపు 18 లీ. నీటిని నిల్వచేసుకోవచ్చు. చవకైన ఈ నీటి పంపుల ద్వారా గంటకి 4-5 వేల.లీ నీటిని తోడేయొచ్చు. వీటి తయారీతో తన తొలి ప్రాజెక్ట్ మొదలు పెట్టాడు. ఐడిఈఐ ప్రాజెక్ట్‌లో కొందరు ఇంజనీర్లు భాగమయ్యారు. మన దేశంలోని ప్రాంతీయ అవసరాలని బట్టీ ట్రెడిల్ పంపు పనిచేసే విధానంలో వారు కొన్ని మార్పులని చేశారు. బిందు సేద్య విధానాన్ని ఉపయోగించే కొన్ని ప్రాంతాల్లోనూ ఈ ట్రెడిల్ పంప్ సెట్లు మంచి ఫలితాలని ఇచ్చాయి. సీజనల్ పంటలకి ఉపయోగించే వివిధ వ్యవసాయ పరికరాల్ని తక్కువ ధరకి అందుబాటులోకి తెచ్చాడు సదంగి. ఎక్కువ ఖర్చులేకుండా లభించే ఈ పరికరాలన్నీ చిన్న రైతుకి లాభాలని అందించాయి. అంగవైకల్యంతో బాధపడుతున్న రైతులెందరో కూరగాయసాగులో ట్రెడిల్ పంపుని ఉపయోగించేందుకు ముందుకొచ్చారు. ప్రస్తుతం స్కాల అండ్ లెమెల్‌సన్‌తో కలిసి పనిచేస్తున్న ఐడిఈఐ మరిన్ని కొత్త ప్రాజెక్టులకి పనిచేస్తోంది. స్ప్రింక్‌లర్స్, నీటినిల్వ ట్యాంకర్లని అందించడంతోపాటు బహుళజాతి సంస్థలకి కార్బన్ క్రెడిట్స్‌ని అందించడం ద్వారా నిధులని సేకరిస్తోంది. గ్రామాల్లో నర్సరీలని ప్రోత్సహిండంతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాల్లో కొనసాగేలా ఈ సంస్థ శిక్షణ అందిస్తుంది. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులకి అవసరమయ్యే వస్తువులని అందించడంతోపాటు ఏ నేలలో ఎలాంటి పంటని సాగుచేసుకోవచ్చనే నిపుణుల సలహాలని ఇక్కడ అందిస్తారు. తక్కువ ఖర్చుతో



వ్యవసాయ పరికరాలని అందించడంతోపాటు ఎన్‌జిఓ సంస్థంగా నిలదొక్కుకున్న ఐడిఈఐ వివిధ దశల్లో రైతుల ఆర్థిక స్థిరత్వానికి తోడ్పడుతోంది. ఐడిఈఐ సేవల ద్వారా గ్రామాల్లో 20శాతం వలసలు తగ్గాయి. పదిహేను శాతం మంది రైతుల పిల్లలు బడికి వెళుతున్నారు. పదిహేడు రాష్ట్రాల్లో పది లక్షలకి పైగా రైతులకి సహకారం అందించింది ఐడిఈఐ. ఈ సంస్థ ద్వారా రూపుదిద్దుకున్న అనేక పరికరాలు మన దేశంతోపాటు ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోనూ వాడుకలో వున్నాయి. రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్న సదంగితోపాటు తన స్థాపించిన ఐడిఈఐ టెంపిల్టన్ ఫ్రీడమ్ ప్రైజ్ ఫర్ సోషల్ ఆంత్రెప్రెన్యూషిప్, టెక్‌మ్యూజియం బిడి అవార్డులని అందుకుంది. ✶



దృశ్య మాంత్రికుడు

సినిమా టైటిళ్లను సరికొత్తగా డిజైన్ చేసినపుడే కమల్ కణ్ణన్ దృశ్య సృజన సినీ లోకానికి తెలిసింది. 'మగధీర'తో దక్షిణాది సినిమా విజువల్స్‌ను చూసి ప్రపంచం ఆశ్చర్యపోయేలా చేసినపుడే ఆర్సీ భారీ చిత్రాలకు గ్రీన్ రూమ్‌ను వేస్తున్నాడని అర్థమైపోయింది. ఇప్పుడు 'బాహుబలి-2'తో ఆర్.సి. కమల్ కణ్ణన్ విజువల్ మెజీషియన్‌గా కనిపిస్తున్నాడు. అతడి వీఎఫ్ఎక్స్‌తో మెరుగు దిద్దిన చిత్రాల ఎఫెక్ట్‌ను ఒక్కసారి చూసి ఊరుకోలేం.

- దర్శకుడు శంకర్ 'భారతీయుడు' చిత్రానికి టైటిళ్లను రూపొందించి సినీ పరిశ్రమకు పరిచయమయ్యారు కమల్ కణ్ణన్.
- అంతకు ముందు దూరదర్శన్ కోసం కొన్ని వీడియోలకు పనిచేశారు.
- సంపాదన బాగుండటంతో అదే ఫీల్డ్‌లో చాలా రోజులున్నారు. ఆ తర్వాత క్రమంగా సినిమాల్లో విజువల్ ఎఫెక్ట్స్ ఇవ్వడం మొదలుపెట్టారు.
- కమ్మొడొర్ 64కె హోమ్ కంప్యూటర్ మీదే పని చేస్తూ వీడియోల్ని టిల్ట్ చేస్తూ సరికొత్త విజువల్స్ కోసం తపన పడేవాడు.
- కంప్యూటర్ గ్రాఫిక్స్ పూర్తిగా కొత్తగా ఉన్న కాలంలో 1989లో 'ఇండియన్ ఆర్టిస్ట్స్' అనే సంస్థను స్నేహితులతో కలిసి ప్రారంభించారు.
- జిజో 'మ్యాజిక్ మ్యాజిక్' అనే 3డి చిత్రానికి జాతీయ అవార్డు వచ్చింది కమల్ జట్టుకు. తొలుత ఎక్కువగా కమర్షియల్స్‌కు పనిచేశారు.
- 'ప్రేమికుల రోజు' చిత్రానికి ఆయన తొలిసారి పనిచేశారు. పలు తమిళ చిత్రాలకు అద్భుత దృశ్యాలను అందించిన ఆయన తెలుగు చిత్రాలకు పనిచేశారు.
- రావణ ప్రభు, కుంజి కూనమ్, బాయ్స్, రన్ వంటి తమిళ్ చిత్రాలు 'టాగోర్', 'యమదొంగ' వంటి తెలుగు చిత్రాలు వాటిల్లో కొన్ని.
- విజువల్ ఎఫెక్ట్స్ సూపర్‌వైజర్‌గా మంచి పేరుతెచ్చుకున్న కమల్ కణ్ణన్ 'మగధీర' చిత్రంతో విజువల్ ఎఫెక్ట్స్ ప్రొడ్యూసర్‌గాను మారారు.
- గ్రాఫిక్స్ విషయంలో భారీ బడ్జెట్‌గా వచ్చిన 'అంజి' చిత్రానికి పోస్ట్ ప్రొడక్షన్‌లో ఆయన పాలుపంచుకున్నారు.
- విజువల్ ఎఫెక్ట్స్ వైపు రావడానికి అలాంటి చిత్రాలు చూసి స్ఫూర్తి పొంది మాత్రం కారణం కాదని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.
- వీఎఫ్ఎక్స్ అనగానే గుర్తొచ్చే 'లార్డ్ ఆఫ్ ది రింగ్స్', పైరేట్స్ ఆఫ్ ది కరీబియన్', 'ట్రాన్స్‌ఫార్మర్స్' వంటి చిత్రాలను పూర్తిగా ఎప్పుడూ చూడలేదట. గ్రాఫిక్స్ అద్భుతంగా ఉన్నాయన్న పోర్షన్లు మాత్రం చూశారట.
- తమిళ సూపర్ స్టార్ విజయ్ చిత్రం 'పులి'కి కూడా కణ్ణనే విజువల్స్ అందించారు. 2000లో విజయ్ చిత్రం 'ఖుషీ'కి చిన్న సీజీ వర్క్ చేశారు కమల్.
- రాజమౌళితో కలసి పనిచేసిన తొలి చిత్రం 'సై'. ఆ తర్వాత సూపర్ హిట్లుగా నిలిచిన 'మగధీర', 'ఈగ' చిత్రాలకి విజువల్ ఎఫెక్ట్స్‌నిచ్చిన ఆర్.సి. కమల్ కణ్ణన్ 'బాహుబలి-2'కు వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్‌గా పనిచేశారు.
- ఈ భారీ ప్రాజెక్ట్‌ను తక్కువ కాలంలోనే దాదాపు 30కి పైగా దేశ, విదేశ స్టుడియోలతో కలసి పనిచేస్తూ అద్భుతంగా తీర్చిదిద్దడంతో కమల్ కణ్ణన్‌కు క్రేజ్ అమాంతం పెరిగిపోయింది.
- 'బాహుబలి' మాహిష్మతి సామ్రాజ్యానికి సంబంధించిన దృశ్యాన్ని కమల్ కణ్ణన్ జట్టే రూపొందించింది.
- 'పులి' చిత్రంలోని కోట గ్రాఫిక్స్‌లో తీసిందంటే నమ్మలేం. ఆ చిత్రంలో 2200కు పైగా వీఎఫ్ఎక్స్ సన్నివేశాలుంటాయి. రష్యా, బల్గేరియా, ఉక్రెయిన్, నెదర్‌ల్యాండ్స్, ఇరాన్ వంటి దేశాలకు చెందిన 160 మంది ఫ్రీల్యాన్సర్లకు ఆయన సారథ్యం వహించారు.
- కమల్ కణ్ణన్ కూడా ఒకప్పుడు ఫ్రీల్యాన్సర్‌గానే పనిచేశారు.
- ఆయన విజువల్స్ రంగ నిపుణులైన పీట్ డ్రేపర్, అడెల్ అదిలితో కలసి మకుట స్టుడియోను స్థాపించారు. ఇప్పుడు ఈ స్టుడియోనే గ్రాఫిక్స్, విజువల్స్ రంగంలో అద్భుతాలు సృష్టిస్తోంది.
- 'ఈగ', 'మగధీర' చిత్రాల్లో విజువల్స్‌కు గాను కమల్ కణ్ణన్‌కు రెండు సార్లు జాతీయ అవార్డులు వచ్చాయి.
- తమిళ దర్శకుడు, నటుడు సుందర్ సి. ఓ భారీ చారిత్రక నేపథ్య చిత్రాన్ని తెలుగు, తమిళ్, కన్నడలో తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సూపర్ స్టార్‌లతో చేద్దామనుకుంటున్న ఈ చిత్రానికి ముందే ఆర్.సి.ని విజువల్ సూపర్‌వైజర్‌గా తీసుకున్నారు.
- చెన్నై వరదల సమయంలో హైదరాబాద్‌లో ఉన్న కమల్ అక్కడకు చేరుకుని బాధితులకు సాయం చేశారు.



నవ్వుల్ - పువ్వుల్

మేధావి

చింటు: నేను కాఫీ కప్పులో కాఫీ చూపిస్తా నువ్వు వరల్డ్ కప్పులో వరల్డ్‌ని చూపించగలవా??

బంటి: అబ్బో...అయితే నేను క్రీమ్ బిస్కెట్‌లో క్రీమ్ తింటాను. మరి నువ్వు టైగర్ బిస్కెట్‌లో టైగర్‌ని తినగలవా.

వెయిటేజ్

శ్రీను ఓ ఇంటర్వ్యూకి వెళ్ళాడు.

మేనేజర్: ఏంటయ్యా మూడు నెలల్లో ఆరు ఉద్యోగాలు మారావు.

శ్రీను: నాకున్న డిమాండ్ అలాంటిది సార్.

కాలక్షేపం

ఇంటర్వ్యూ బోర్డ్‌లో ఒక మెంబర్: మేము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పినా నీకు ఉద్యోగం రాలేదనుకో అప్పుడు నువ్వేమనుకుంటావ్??

రాము: ఈ పిచ్చి వెధవలతో కాసేపు కాలక్షేపం అయ్యింది అనుకుంటా.....!!



కిసుక్కు

బిట్టు: వురేయ్... నీ గొడుగుకు చిల్లు పడింది...

చంటి: ఎండ తగ్గిందో లేదో తెలుస్తుందని నేనే పెట్టా!

బిట్టు: ఆ.......

ఉడతా సాయం

సుబ్బారావ్: మొన్న ఒక 300 మంది షిప్‌లో వెళుతూ చచ్చిపోయారట!

అప్పారావు:ఏం షిప్ నీళ్లలో మునిగిపోయిందా?

సుబ్బారావు: కాదు షిప్ నీళ్లలో ఆగిపోయింది. వీళ్లు నెట్టడానికి కిందకి దిగారట.

హోటల్ డాక్టర్

రమేష్: ఈ డాక్టర్ గతంలో ఏదైనా హోటల్లో పనిచేసి ఉంటాడని నా అనుమానం

సోమేష్: ఎలా చెప్ప గలవు?

రమేష్: ఇంజెక్షన్ చేయించుకున్నాక డబ్బులు లేవంటే క్లినిక్‌లో టవల్స్ గట్రా ఉతికించాడ్రా మరి.

కిసుక్కు సిత్రం

రెండోదే బాగున్నట్టుంది.. అదే ప్రింటిచ్చుకో..!

నాకు నచ్చిన చిత్రం



ఇల్లస్ట్రేటర్ : ఫ్రాన్సెస్కో బొంగియోర్ని

సేకరణ : బాలు, గుణదల

నవ్వవయ్యా బాబూ..!

నవ్వడం ఒక భోగం,
నవ్వించడం ఒక యోగం,
నవ్వలేకపోవడం ఒక రోగం. అని సెలవిచ్చాడు దివంగత రచయిత జంధ్యాల. కానీ ఇప్పుడున్న ఒత్తిడి జీవితాల్లో హాయిగా నవ్వి ఎన్ని రోజులవుతోందో లెక్క గుర్తుండదు. నలుగురితో కలిసి నవ్వులాటలో మునిగి ఎంత కాలమైందో అస్సలు పట్టదు. పొట్ట చెక్కలయ్యేలా నవ్వినవ్వి ఆయాసం తెచ్చుకున్న సందర్భాలున్నా లేకున్నా నగుమోముతో ఉదయాన్నే లేచి అద్దంలో ముఖం చూసుకునేంత అవకాశముందో లేదో చాలామందికి.! బంధాలు ఆరోగ్యంగా.. సంబంధాలు సజీవంగా... వాతావరణం హాయిగా... ఉండాలంటే కలసి నవ్వుతూ తుళ్లుతూ కదలాలంటున్నారు. నవ్వుల దినోత్సవం సందర్భంగా
ఈ వారం అట్ట మీది కథ.

డాక్టర్. రావెళ్ల శ్రీనివాసరావు
9030105618

నవ్వు అంటే ఏమిటో తెలుసుకుందాం. మీరు హాస్య రసాన్ని విన్నా, చదివినా, చూసినా మనసులో కలిగే ఎన్నో ఆనందానుభూతులు నవ్వు తుదిరూపమైనవని స్పష్టంగా చెప్పవచ్చు. హాస్యకారుల చిత్రమైన ప్రవర్తన, జోకులు, కార్టూన్లు, మనకు నవ్వు తెప్పిస్తాయి. రొటీన్‌కి భిన్నంగా ఏది వున్నా మనకు నవ్వు తెప్పిస్తుంది. ఉదాహరణకు కాళ్ళకు చెప్పులు వేసుకొని నడుస్తాం... కానీ ఎవరైనా నెత్తి మీద చెప్పులు పెట్టుకొని చిన్నగా రోడ్డు మీద పోతుంటే నవ్వకుండా ఎవరుంటారు చెప్పండి. అలాగే ఒక కాలికి బూటు, మరోకాలికి చెప్పులేసుకుని నడిచినా పగలబడి నవ్వుతాం... మరి అది వాస్తవానికి దూరంగా వుంది. నవ్వు ఎలా పుట్టినా అది మనలోని ఉద్రిక్తతలను, కోపాన్ని, తగ్గించగలిగే సాధనం హాస్యం. 'హ్యూమర్' అనే పదం లాటిన్ భాష నుంచి ఉద్భవించింది. హ్యూమర్ అంటే ఆర్ద్రత, తేమ, తడి అని అర్థం. నవ్వు ముఖాలు అందరినీ ఆకర్షిస్తాయి. కనుకనే ప్రకటన దారులు ఎప్పుడూ-అలాంటి ముఖాలనే ఆహ్వానిస్తారు. నవ్వు ప్రజలందరి సొత్తు. అది జన్మత: సహజంగా మానవునికి లభించింది. దానిని ఆనందించడానికి ఎలాంటి పెట్టుబడి అవసరంలేదు. బ్రిటీషు హార్ట్ ఫౌండేషన్ ఆచార్యులు ఆండ్రోస్టెప్టో 'రోజుకు 15నిమిషాలు నవ్వు - గుండె జబ్బులకు దూరం అవ్వు' అని ఉద్ఘాటించారు.



హాస్యప్రియత్వాన్ని అలవరిచారు. ఆశావహ దృక్పథాన్ని పెంపొందించుకో అని



సూచించారు. నవ్వు మనిషి ఆరోగ్యాన్ని పెంచితే బాధలు ఆరోగ్యాన్ని తగ్గిస్తాయి. ఉద్రిక్తత, ఒత్తిడిని పెంచే చిత్రాలను చూడడం అంటే డబ్బుపెట్టి అనారోగ్యాన్ని కొనుక్కోవడమేనన్న మాట! దైనందిన జీవితంలో సమస్యలు ఎలాగో ఉంటాయి. అవి చాలదన్నట్టుగా కావాలని ఏడుపుగొట్టు చిత్రాలను, సీరియళ్లను చూస్తూ బాధపడడం దేనికి? అందుకే హాయిగా నవ్వించే, మైమరపించే వాటిని చూసి ఆనందించాలి. ఆనందిస్తూ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి.

ఆరోగ్యానికి రాచబాట

కడుపారా నవ్వడం చక్కటి ఆరోగ్యానికి రాచబాట అని అమెరికన్ కార్డియాలజిస్ట్ మైఖెల్ మిల్లర్ భావిస్తే, కామెడీ పుస్తకాలు చదవమని, హాస్య సినిమాలు చూడమని కెనడాలోని మనోవిజ్ఞాన శాస్త్ర ఆచార్యుడు రాడ్‌మార్చిన్ సూచించాడు. ఒత్తిడి సమయంలో హాస్యం మనిషిలో సంయోగశక్తిని పెంచుతుంది. భయపెట్టని వార్తా సౌకర్యంలాంటిది నవ్వు. కడుపారా నవ్వితే కడివెడు ఆనందం చేకూరుతుంది. బాధలను తొలగించడానికి ఉపయోగపడే గొప్ప శక్తి నవ్వు. ఉద్రిక్తత కలిగించే హార్మోనులైన ఎపినెఫ్రైన్, కార్టిసోల్‌ల స్థాయిని నవ్వు గణనీయంగా తగ్గిస్తుంది. మనం నవ్వినప్పుడు ఎండార్ఫిన్‌లు, సెరటోనియమ్ రక్తంలోకి భారీగా ప్రవహించడంలో ప్రశాంతమైన, ఆనందమైన మానసిక స్థితి ఏర్పడుతుంది. ప్రతి మనిషిలోనూ రక్షణ కవచం ఒకటి ఉంటుంది. క్యాన్సర్, ఎలర్జీ, అంటు వ్యాధుల నుండి అది కాపాడుతుంది. ఆదొక కోటలాంటిది. వైద్య శాస్త్రంలో దానినే రక్షిత వ్యవస్థ అంటారు. సైకోన్యూరో ఇమ్యునాలజిస్టల ప్రకారం వ్యతిరేక భావావేశాలైన ఆందోళన, కోపం, నిరుత్సాహం మానవుని రక్షిత వ్యవస్థను బలహీనపరిచి అంటువ్యాధులను నిరోధించే శక్తిని తగ్గిస్తాయి. 'నవ్వు తెల్ల రక్తకణాల సంఖ్యను పెంచి రక్షిత వ్యవస్థను పటిష్టపరుస్తుంది' అంటాడు అమెరికా వైద్యుడు డా. లీ ఎస్‌బెర్గ్. ఉబ్బసం, బ్రాంకైటిస్‌లతో బాధపడేవారు హాస్య చికిత్స మూలంగా ఎంతో ప్రయోజనం పొందవచ్చు.



అలాగే నవ్వు వల్ల క్లబ్‌ల సభ్యులకు, సాధారణంగా వచ్చే జబ్బులు తగ్గిపోవడం విశేషం. నవ్వు అనేది అనేక రోగాలను దరిచేరనీయదని ఆయుష్షును పెంచుతుందని రుజువుచేశారు.. మిచిగాన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు. బేస్‌బాల్ క్లబ్‌కు చెందిన 184 మందిని పరిశీలించి.. క్రీడాకారుడిగా కెరీర్ మొదలు పెట్టిన నాటి వయసు నుండి ఆటగాడు మరణించే వయసు వరకూ అతని జీవితంలో వివిధ దశలలో దిగిన ఫోటోలను పరిశీలించారు. వివరాలు సేకరించారు. జీవితంలో ఎన్నడూ నవ్వని ఆటగాళ్లు సరాసరిన 72.9 సంవత్సరాలు జీవించినట్లు గుర్తించారు. అప్పుడప్పుడూ నవ్వేవాళ్లు 75 ఏళ్లు, బిగ్గరగా నవ్వేవాళ్లు 79.9 ఏళ్లు జీవించినట్లు గమనించారు. అంటే మిగతావారితో పోలిస్తే ఆహ్లాదంగా హాయిగా నవ్వేవాళ్లు ఏడేళ్లు ఎక్కువగా జీవించినట్లు అధ్యయనంలో గుర్తించారు. అయితే మొహమాటానికి ఉత్తుత్తిన నవ్వులు చిందించే వారి ఆయుష్షులో ఎలాంటి మార్పు లేదని మాత్రం తేల్చిచెప్పారు. బిగ్గరగా నవ్వేవారి ముఖంపై ఉండే కండరాలు సంకోచ వ్యాకోచం చెంది కాంతివంతమైన ముఖవర్చస్సుతో ఉంటారని చెప్పారు.

నేర్చుకోవాల్సిన అవసరం లేని

అసలు నవ్వడం రాదనే వాళ్లు ఎవరూ ఉండరు. అందరి ముందూ నవ్వడానికి మొహమాటపడే మహామహులు కూడా గోడచాటుకు వెళ్లి నవ్వులు రువ్వాల్సిందే. నవ్వలేని వారిలో సులభంగా మార్పు తీసుకురావచ్చు. నవ్వు వచ్చినప్పుడు మనం బలవంతంగా ఆపగలమే కానీ బలవంతంగా మాత్రం నవ్వలేం. నవరసాల్లోకి హాయిగొలిపే రసం హాస్యరసం. ఇది మానవ జీవితాల్లో తగ్గిపోతుందని సర్వేలు చెప్పేస్తున్నాయి. దీని స్థానంలో కోపం, ముభావం, ఆవేశం, అసంతృప్తి వంటివి చోటుచేసుకుంటున్నాయి. దశాబ్దాలుగా మనిషి వీటి నుండి బయట పడలేకపోతున్నాడు. దానికి ఒకటికాదు రెండుకాదు అనేక రకాల కారణాలున్నాయి. జీవితంలో పెరిగే ఒత్తిడి పోటీ దూరం చేస్తున్నాయి. నేటికాలంలో ఆరోగ్యపరమైన హాస్యం లోపిస్తుంది.

ఈ బిజీ జీవితంలో ఒకరికొకరు కూర్చుని కబుర్లు చెప్పుకునే రోజులు లేకుండా పోయాయి. స్థిమితంగా ఒకచోట కూర్చుని ముచ్చట్లు చెప్పుకునే అవకాశాలు ఎవరికీ ఉండటం లేదు. ఎప్పుడూ ఏవో చికాకులు ఆలోచనలు అర్థం పర్థంలేని లక్ష్యాల సాధన, కొందరయితే డబ్బే పరమావధిగా భావిస్తూ ఉరుకులు పరుగుల జీవితపు ఒత్తిడిలో కాలం వెళ్లదీస్తున్నారు. అందుకే మనుషులకు నవ్వే భాగ్యం కరువైపోయింది. అందుకే నవ్వడం కొత్తగా

నేర్చుకోవాల్సిన అవసరం వచ్చిపడింది. లాఫింగ్ క్లబ్బుల ద్వారా, నవ్వు మరచిపోయినవారికి నవ్వడం నేర్పిస్తున్నాయి. మనలో దాగి ఉన్న నవ్వును మనమే చంపుకుని మళ్లీ మనమే డబ్బులిచ్చి మరీ నవ్వడం నేర్చుకుంటున్నాం. ఇది నిజంగా నవ్వు తెప్పించే విషయమే మరి. ఏది ఏమైనా మనలో వికారభావనలను తొలగించి మనసుకు స్వాంతన చేకూర్చే సాధనం మాత్రం నవ్వే. కనీసం ఈ రోజైనా హాయిగా నవ్వండి.

నవ్వుల రోజు

మొదట్లో దీనిని జనవరి రెండో ఆదివారం నాడు జరుపుకునేవారు. ప్రపంచంలోని చాలా దేశాలలో జనవరి నెలలో చలి వాతావరణం ఉంటుంది కాబట్టి ఈ తేదీని మార్చాలని హాస్య ప్రియులు కోరారు. అందుకే లాఫర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారు ఈ దినోత్సవాన్ని మే నెల మొదటి ఆదివారం నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి ఆద్యులు sleve wilson.

భారత దేశంలో మొదటి నవ్వుల దినోత్సవం 1998 జనవరి 11వ తేదీన ముంబయిలో నిర్వహించారు. దీనికి 12 వేల మంది హాజరయ్యారు. భారతదేశంలో బయట ఈ నవ్వుల దినోత్సవం డెన్మార్క్ రాజధాని కొపెన్ హాగెన్‌లో 2000 జనవరి 9 వ తేదీన నిర్వహించబడిన ఈ దినోత్సవానికి పది వేల మంది హాజరైనారు. ప్రపంచ శాంతి ఈ దినోత్సవం నిర్వహణ పరమార్థమని నిర్వాహకుల అభిప్రాయం.

కార్టూన్లకూ ఓ మ్యూజియం

కార్టూన్ చిత్రాలకు లండన్‌లో ఒక మ్యూజియం వుంది. అసలు కార్టూన్ పేరు చెప్పగానే వ్యంగ్య చిత్రమో, హాస్య చిత్రమో ఊహల్లో మెదులుతుంది. నవ్విస్తూనే చురకలు పెట్టేలా ఉంటాయి కార్టూన్లు. ఈ కార్టూన్ చిత్రాలకు తోడు, ఎన్నెన్నో కామిక్స్ పుస్తకాలు సైతం ఈ మ్యూజియంలో దర్శనమిస్తుంటాయి. కార్టూన్లను ఇష్టపడనివారు లేరు. చూశాక నవ్వని వారు ఉండరు. 2006లో ప్రారంభించిన ఈ మ్యూజియంలో పాత కాలం నుండి నేటిదాకా సేకరించిన 1700 అద్భుతమైన ఒరిజినల్ కార్టూన్లు ఉంచడం ఒక ఆకర్షణ.

కార్టూన్ బొమ్మలు, కామిక్స్, కారికేచర్లు, యానిమేషన్ కోసం గీసిన బొమ్మలు ఇలా వివిధ విభాగాలున్నాయి. హాస్య, వ్యంగ్య పుస్తకాలతో కూడిన గ్రంథాలయం కూడా ఉందిక్కడ. ప్రతి ఏటా ఉత్తమ కార్టూనిస్టుకు క్యాట్ అవార్డును బహూకరిస్తారు. పిల్లలకు కార్టూన్లు గీయడంలో మెలకువలు నేర్పిస్తారు.

నవ్వుల బిళ్లలేసుకోండి

◈ రోజూ కొన్ని జోకులు చదవండి. లేదా మీకు ఇష్టమైన హాస్యకథ ఉంటే మంచి కార్టూన్ల పుస్తకం తిరగేయండి.

◈ స్నేహితులతో రెండు గంటలు గడపండి. మార్నింగ్ వాక్‌లో హాయిగా కబుర్లు చెప్పుకుంటూ జోకులు పేల్చుకుని తెగ నవ్వుకోండి.

◈ టీవీల్లో వచ్చే కామెడీ షోలను అస్సలు వదలకండి. జుగుప్సకరమైన హాస్యమే ఎక్కువ దొర్లుతుంటే మరో చానెల్‌లో నవ్వుల్ని వెతుక్కోండి. అంతే కానీ సీరియస్ ప్రోగ్రామ్‌ల జోలికి వెంటనే వెళ్లకండి.

◈ సామాజిక మాధ్యమాల్లో నవ్వుకునే వీడియోలు ఎన్నో వస్తుంటాయి. మంచివాటిని సేవ్ చేసుకుని మళ్లీ మళ్లీ చూసుకోండి. వీలైతే నలుగురికి షేర్ చేయండి. నవ్వించే సైటులు చాలా ఉన్నాయి. వాటిపై ఓ కన్నేయండి.

◈ లాఫింగ్ యోగా అని కూడా ఉందండోయ్. దాన్ని ఓసారి ట్రై చేయండి. మర్చిపోకుండా ఈ గొలుసుకట్టు యాపారంలో అందర్నీ ముఖ్యంగా మీ కుటుంబాన్ని చేర్చండి.



◈ వచ్చినా రాకపోయినా మీ పిల్లలతో కలిసి మీరూ ఆటలాడండి. తడబడి కిందబడ్డా... బాగా నవ్వుకోండి. పిల్లల నవ్వులతో శృతి కలపండి.

◈ పిల్లలు తమ వయసువారు కనిపిస్తే హాయిగా ఆడుకుంటుంటారు. పెద్దలు కూడా తోటివారితో అలాగే వ్యవహరించాలి. నిజాయితీగా మాట్లాడాలి. తక్కువస్థాయి వారిని, తమలాగా మంచి ఉద్యోగంలో చేరినా అనుకోకుండా తెలిసినవారందరితో నిజాయితీగా మాట్లాడడం వల్ల నెట్‌వర్క్ పెరుగుతుంది. సత్‌సంబంధాలు బలపడతాయి.

◈ ఎప్పుడూ పిల్లలను కంప్యూటర్లు, టీవీల ముందు నుండి తప్పించి ఆరుబయట తీసుకెళ్లి సెన్సాఫ్ హ్యూమర్ గురించీ, నవ్వు గురించీ చెప్పండి. నవ్వొచ్చే సంఘటనలను వివరించి చెప్పండి.

◈ మనిషి ఒక్కనిమిషం నవ్వగలిగితే 45 నిమిషాల పాటు శరీరానికి కావలసిన విశ్రాంతి లభిస్తుందంటున్నారు శాస్త్రవేత్తలు. నవ్వు ఆకలిని పెంచుతుంది. గుండె కొట్టుకునే వేగాన్ని తగ్గిస్తుందని ధ్రువీకరించారు.

◈ నవ్వు ఆవేదనను తగ్గిస్తుంది. అందుకే సమస్య వచ్చినప్పుడు నవ్వాలి. నవ్వులన్నింటిలోకి నిన్ను చూసి నువ్వు నవ్వగలగడం అద్భుతమైనది. అది నీ స్థాయినీ నీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.

పిల్లలు మరుమల్లె పువ్వులు

పిల్లల మనసు ఎంతో స్వచ్ఛంగా ఉంటుంది.

ఇదే హాస్యం



◈ఒక వస్తువును వింత ఆకృతిలో చూడగలగడమే హాస్యం. - జాక్స్మిత్

◈ఒక మంచి హాస్యోక్తి మనపై చెరగని ముద్రవేసి చక్కని ఆనందాన్ని అందిస్తుంది.

- ఫ్రాయిడ్

◈హాస్యం తక్షణ విశ్రాంతినిస్తుంది. అదొక సెలవు దినం లాంటిది.

- లిల్లీ టామ్లిన్

◈హాస్యం వాక్య నిర్మాణం పైన, పదాల పొందికపైన నిలబడుతుంది.

- బెర్గ్‌సన్

◈మనోవిజ్ఞాన క్షేత్రంలో ఏర్పడిన ఆనందానుభూతి హాస్యం. **- మొరియల్**

◈దిశ మార్పు లేదా పొరపాటు మూలంగా హాస్యం జనిస్తుంది. **- బపిలైర్**

◈చమత్కారం దిగజారి వికృతిని సంతరించుకుంటే అది హాస్యం అవుతుంది

- యుని

◈ఆహారంలో ఉప్పులా జీవితానికి హాస్యం ఉపకరిస్తుంది **- సి. నా.రె.**

◈నవ్వుకు కారణం ఆనందం

- థామస్ హాబ్స్

◈నవ్వే జంతువు మానవుడే

- విలియం హాజ్లిట్

◈నవ్వు అసలు సిసలైన దివ్యౌషధం. అదిలేని బ్రతుకు నరకం **- డొన్న మెర్‌మల్**

◈కడుపారా నవ్వడం చక్కని ఆరోగ్యానికి రాచబాట **- మైఖేల్ మిల్లర్**

◈నీవు నవ్వితే ప్రపంచం నీతో నవ్వుతుంది. ఏడిస్తే ఒంటరిగా ఏడవాలనిపిస్తుంది **- ఎల్‌కాక్స్**

◈నవ్వు పోయిందంటే రోగం వచ్చిందన్నమాటే **- వెండేర్**

◈మనం నవ్వని రోజులన్నీ ఊరికే వృథా అయినట్లే **- ఆర్.ఎన్. ఛామ్‌ఫోర్ట్**

◈హాస్య చతురత లేని వ్యక్తికి ఎక్కడా స్థానం ఉండదు **- హ్యారీ రూమన్**

◈ఈ భూలోకంలో ఉల్లాసానికి, హాస్యానికి కరువు ఏర్పడింది **- నెల్సన్**

కామెడీ కింగ్ 'చాప్లిన్'

డైలాగులేమీ లేకుండా, అసలు మాటలే లేకుండా నవ్వించడం చార్లీకే చెల్లింది. "నా బాధ ఒకరిని నవ్విస్తే ఫరవాలేదు. కానీ నా నవ్వు ఒకరిని బాధించరాదు" అంటాడు చార్లీచాప్లిన్. స్విట్జర్లాండ్‌లోని 'వేవే'లో 25 ఏళ్లపాటు ఆయన నివసించారు. అక్కడ చాప్లిన్ పేరుతో ఒక మ్యూజియం కూడా ఏర్పాటు చేశారు. మనస్ఫూర్తిగా నవ్వాలంటే బాధతో ఆడుకోవాలని చెప్పే చాప్లిన్ జీవితంలో వ్యర్థమైన రోజంటూ ఉందంటే అది నవ్వని రోజే. అని కూడా చెప్తాడు.

తెలుగు వారికి ఎన్నో హాస్య కథల్ని అందించిన భమిడిపాటు కామేశ్వరరావు గారు నిజ జీవితంలోను గొప్ప హాస్య చతురత ఉన్నవారే. ఒకసారి ఆయన ఒక పాఠశాల వార్షికోత్సవానికి అతిథిగా పాల్గొని ప్రసంగిస్తుండగా మధ్యలో వర్షం ప్రారంభమై క్రమంగా పెరిగింది. భమిడిపాటివారు నవ్వుతూ సంవత్సరానికి ఒక్కసారే వచ్చేది వార్షికోత్సవం. ఇటీవలికాలంలో వర్షంకూడా సంవత్సరానికి ఒక్కసారే వస్తోంది. అందుకే దీనిని వర్షకోత్సవం అందాం" అనడంతో సభలో నవ్వుల పువ్వులుపూశాయి. మరొకసభలో ఆయన కారు చౌక ఏది? అని ప్రశ్నించారు. సభలోనుండి సమాధానం రాలేదు. 'పుకారుచౌక' అని ఆయన అనడంతో అందరూ హాయిగా నవ్వుకున్నారు. ఇలాంటి హాస్యోక్తులు అందించడానికి కొంత విజ్ఞానం, కొంత లోకజ్ఞానం కూడా ఉండాలి.

పండితులు కలిస్తే డబ్బాలు కొట్టుకుంటారంటాడు ఒకాయన. ఆ ముక్కు పొడుం డబ్బాలు కొట్టుకుంటారులే అన్నాడు మరొకయాన.

జర్మనీలో చిన్నపిల్లల వైద్యులు బఫూన్ వేషం వేసుకొని పిల్లలను నవ్విస్తూ వారికి చికిత్స చేస్తారు. కడుపుబ్బ నవ్వించడమే ఆరోగ్యానికి అసలైన చిట్కా అన్నది వారి ఆలోచన. వైద్యులు శాస్త్రవేత్తలు కలసి నవ్వుల ప్రాజెక్టును రూపొందించారు.

పిల్లలకు కల్లాకపటం తెలీదు. నలుగురిలో ఉన్నప్పుడు ఏదైనా నవ్వు తెప్పించే సంఘటన జరిగిందంటే చాలు పిల్లలు గబుక్కున నవ్వేస్తారు. ఆనందిస్తారు. పెద్దవాళ్లు అలా కాదు. నవ్వితే ఎవరైనా ఏమైనా అనుకుంటారేమోనన్న భయంతో, సగం నవ్వునవ్వి మిగతాది దిగమింగుకుంటారు. ఇలాంటివారిలో ఆత్మన్యూనతాభావం ఎక్కువగా ఉంటుంది. బలవంతంగా నవ్వును నియంత్రించుకోవడం కంటే హాయిగా నవ్వేయడమే మంచిదని మానసిక నిపుణులు చెబుతున్నారు. హాయిగా నవ్వితే ఒత్తిడి తగ్గి మానసిక స్వాంతన లభిస్తుంది. ఆనందంగా నవ్వడం వల్ల శరీరంలో చెడు కొలెస్టరాల్ తగ్గుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.



ప్రతి ఒక్కరూ రోజులో కొంతసేపన్నా నవ్వాలి. మీరు నవ్వితే మీ గుండె కూడా నవ్వుతుంది. దాంతో గుండెలో రక్తం గడ్డకట్టదు. రక్తపోటు నార్మల్‌గా ఉంటుంది. మరొక ముఖ్యవిషయం 1999లో జరిగిన ఒక పరిశోధనలో గుండె పోటు నుంచి బయట పడిన వారు రోజుకు 30 హాస్యోక్తులను వింటూ ఆనందిస్తే వారికి రెండవ పర్యాయం ఆ వ్యాధి వచ్చే అవకాశాలు తక్కువని నవ్వడం వలన మందులు కూడా తక్కువ మోతాదులో వాడుకోవచ్చని స్పష్టమైంది. ✦



బోగీ నివాసి

జపాన్‌కు చెందిన గైగాడ్జీ అనే వ్యక్తి రైలుతో పీకల్లోతు ప్రేమలో ఎప్పుడూ ఉంటాడు. రైలు ప్రయాణాలు చేయడంతోనే తన ప్రేమను చాటలేదు. ఏకంగా తనింటిలో బెడ్రూమ్‌లను రైల్ కార్ రూపంలో డిజైన్ చేయించుకుంటున్నాడు. రెండు రూమ్‌ల్నేమో క్లాసిక్ 485 సిరీస్‌ను పోలిన బోగీల్లా మార్చేసుకున్నాడు. ఇప్పుడు మూడో దాన్ని మరో రైల్ కార్ లుక్‌లోకి తీసుకొచ్చే పనిపెట్టుకున్నాడు. అప్పుడు ఇంట్లో ఉన్నా రైలులో కదులుతున్న ఫీలింగ్‌తో బతికేయొచ్చు అని అంటున్నాడు. ఇతనే కాదు చాలామంది జపనీయులకు రైళ్లంటే మహా పిచ్చి. ఏకంగా వాటి అభిమాన దళమే ఉంది. 'టెట్సుడో ఫ్యాన్' పేరిట ఉండే ఆ బృందం రైళ్లకు సంబంధించిన అనేక విషయాలను, వివరాలను ఒకరితో ఒకరు పంచుకోవడంతో పాటు పాత కమిషన్డ్ బోగీలను కొంటుంటారు కూడా. లేదా పాత వాటితో మ్యూజియాల్లాంటివి పెట్టాలని ప్లాన్ చేస్తుంటారు. రకరకాల రైళ్లలో దేశం తిరిగి ఆ ఫొటోలను కమ్యూనిటీలో పంచుకుని ఆనందిస్తుంటారు. ఎవరెన్ని రకాల రైళ్లలో ఎంత సేపు, ఎంత దూరం ప్రయాణించారనేదే వారి అభిమానానికి కొలబద్ద. అయితే వీరెవరూ కూడా గైగాడ్జీతో పోటీ పడలేరేమో.

నిద్రా వ్యాయామం

కంటి నిండా నిద్ర పోకుంటే ఆరోగ్యానికి చాలా హాని అని ఎంత వ్యాయామం చేసినా నిద్ర ముఖ్యమని యూకేకు చెందిన ఓ జిమ్ కంపెనీ అంటోంది. అందుకే 'నేపర్‌సైజ్' అనే ఓ కొత్త రకం ఎక్సర్‌సైజ్‌ను జిమ్ షెడ్యూల్‌లో చేర్చింది. పావుగంట పాటు తేలికపాటి వ్యాయామం తర్వాత నేరుగా బెడ్ ఎక్కించి 45 నిమిషాల పాటు హాయి నిద్ర పోనిస్తోంది. మత్తుగా నిద్ర పోయేలా 'అట్మాస్ఫిరిక్' శబ్దాలను, గాలి, వెలుతురులను, మెత్తను, కళ్ల గంతలను జిమ్‌లో ఏర్పాటు చేసింది యూకేలోని ప్రముఖ వ్యాయామ శాలల ఫ్రాంఛైజీ డేవిడ్ ఎల్లాయిడ్ కంపెనీ. తమ జిమ్ శాఖల్లో 'నేపర్‌సైజ్' సెషన్లను అందిస్తోంది. అక్కడి ఓ రిపోర్టు ప్రకారం 86 శాతం తల్లిదండ్రులు విపరీతమైన అలసటకు లోనవుతున్నారని, 26 శాతం మంది రోజుకు కేవలం 5 గంటలే నిద్రపోతున్నామని తెలిపారట. అందుకే ఈ ప్రత్యేక నిద్రా వ్యాయామం అంటోందా కంపెనీ. నిద్రలోనే కేలరీలు కరిగిపోయేలా గది ఉష్ణోగ్రతలు, ఇతర మార్గాలను ఉపయోగిస్తామని, జిమ్ చేసిన ఫలితమే ఉంటుందని భరోసా కూడా ఇస్తోంది.

వింత లోకం

స్పైడీ పరిశుభ్రత

ప్రాణాలకు తెగించి చెత్తను ఏరివేసే పని చేస్తున్నారు చైనాకు చెందిన స్పైడర్‌మేన్ క్లీనర్లు. పేరుకు తగ్గట్టే వేల అడుగుల ఎత్తునుండే పర్వతాల్లో వీరి పని సాగుతుంది. సందర్శకులు, పర్యాటకులు పడవేసే వ్యర్థాలు అక్కడి ప్రకృతికి చేటు కలుగజేసేవి. వాటి ఏరివేత సాధారణ వ్యక్తులకు సాధ్యపడేది కాదు. వందల అడుగుల నిటారు లోయల్లో చరియల మధ్య చిక్కుకునే ప్లాస్టిక్ బాటిళ్లు, టిఫిన్ బాక్సులే కాదు అనేక రకాల చెత్త పేరుకుపోయి ఆ పర్వతాల రమణీయత దెబ్బతినేది. స్పైడర్‌మేన్ క్లీనర్లే సాహసించి తాళ్ల సాయంతో పర్వతారోహణ నైపుణ్యంతో కొన్ని టన్నుల వ్యర్థాలను తొలగించడం మొదలుపెట్టారు. పదుల ఏళ్ల నుంచి సాగుతున్న వీరి సాహస కార్యక్రమం వల్ల అక్కడి చాలా పర్యాటక ప్రాంతాలు వ్యర్థ రహితంగా మారాయి. సందర్శకులు వీరి సాహసాన్ని దగ్గర నుంచి చూడటంతో పర్యాటక స్పృహ కలిగి చెత్తను వేయడం మానేస్తున్నారట. ఈ స్పైడర్‌మేన్ క్లీనర్లలో మహిళలు కూడా ఉన్నారు. అప్పుడప్పుడు స్పైడర్‌మేన్ దుస్తులు వేసుకుని పని చేయడం వల్ల వారికాపేరు వచ్చింది. ఎంత ఆ పేరు వాడినా పట్టు తప్పితే అంతే. 30 మీటర్లు కిందకు దిగాలంటే గంటన్నర సమయం పడుతుంది.

బామ్మ పరుగు బంగారం

బుడి బుడి అడుగులు పడి పడగానే పరుగు అందుకోవాలనే బుజ్జిగాడు.. జవసత్వాలు వేడి నెగళ్లిస్తూ పరుగులు తీసే యువకుడు.. నడి వయసును ఇంకాస్త దూరం జరుపుకుందామనుకుని పరుగు అందుకునే యాభైల మనిషి... వీరందరూ సరే మరి ముదిమి బామ్మ పరుగు తీస్తేనో..! వందేళ్లు బతకడమే గొప్ప అనుకుంటే 101 పుట్టిన రోజును పరుగు తీసే వేడుక చేసుకుంటేనో...! జీవితంలో ఏదైనా సాధించడానికి వయస్సు ఏ మాత్రం అడ్డురాదని ఈ సెంచూరియన్ బామ్మ నిరూపించింది. లేటు వయస్సులో పరుగు పందేల్లో పాల్గొంటూ 20 పతకాలను సాధించిన మాన్ కౌర్ ఓ విజేతే.

విజేత

పంజాబ్ రాష్ట్రంలో చండీగఢ్‌కు చెందిన 101 ఏళ్ల బామ్మ మాన్ కౌర్ ఏడేళ్ల కాలంలో పరుగు పందేల్లో 17 బంగారు పతకాలు సాధించింది. మొన్నామధ్య వందేళ్లు పూర్తయినా కూడా ఆమె పరుగు ఆగకపోవడంతో వార్తల్లో వ్యక్తి అయ్యింది. పటియాలాలో 1916లో మాన్ కౌర్ జన్మించింది. మహారాజా భూపేందర్ సింగ్ రాజభవనంలో వంట పని చేసే ఎస్ రంజిత్ సింగ్‌ను వివాహం చేసుకుంది. నలుగురు పిల్లలు పుట్టగా ఓ బాలిక చనిపోయింది. అతని పెద్ద కుమారుడే గురుదేవ్ సింగ్ 60 ఏళ్ల వయస్సులో మాస్టర్ అథ్లెటిక్స్‌లో పాల్గొని సత్తా చాటాడు. అమెరికా, కెనడా, సింగపూర్, మలేసియా మాస్టర్ ఛాంపియన్‌షిప్‌లో 60 వరకు పతకాలను సాధించాడు. అతను మాస్టర్స్ ఈవెంట్‌ల్లో అంతర్జాతీయ అథ్లెట్లను చూసి స్ఫూర్తి పొందాడు. ఓ సారి కెనడా వరల్డ్ మాస్టర్స్ ఛాంపియన్‌షిప్‌లో 90 ఏళ్ల ఓల్గా అనే అథ్లెట్ పాల్గొంది. ఆమెను చూసి ఆశ్చర్యపోయిన గురుదేవ్‌కు తన తల్లి కౌర్ ఫిట్‌నెస్ గుర్తుకొచ్చింది. ఆమెను కూడా పరుగు పందేల్లోకి తీసుకురావొచ్చని ఇదే సరైన సమయంగా నిర్ణయించుకున్నాడు. అథ్లెటిక్స్‌లో పాల్గొనవచ్చు కదా అని తల్లిని ఒప్పించాడు. గురువుగా మారి 100, 200 మీటర్లు పరుగు పందెంతో పాటు లాంగ్ జంప్ ఈవెంట్‌ల్లో తల్లికి శిక్షణ ఇవ్వడం మొదలెట్టాడు. పంజాబ్ విశ్వవిద్యాలయం మైదానాల్లో కౌర్ పరుగెత్తడం చూసి అచ్చెరువొందిన సింగ్ కౌర్‌ను పోటీల్లో దింపాలని నిర్ణయించుకున్నాడు.

93 ఏళ్లకు..

తొలిసారిగా 93 ఏళ్ల వయస్సులో సొంత రాష్ట్రంలోని చండీగఢ్‌లో మాస్టర్స్ అథ్లెట్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. అక్కడే పసిడి పరుగుతో కౌర్ మెరిసింది. ఆ తర్వాత జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో 100, 200 మీటర్లు పరుగుల్లో రెండు స్వర్ణాలను సాధించింది. ఈ రెండు ఈవెంట్‌ల్లో ఏడు బంగారు పతకాలతో వరల్డ్ రికార్డును సాధించింది. జులై 2012 అమెరికాలో జరిగిన సాక్రమెంటో మీట్‌లో 100 మీటర్ల పరుగును 61 సెకన్లలోను, ఆ తర్వాత బెంగళూరులో జాతీయ ఛాంపియన్‌షిప్‌లో 59 సెకన్లలో లక్ష్యాన్ని అధిగమించి వరల్డ్ రికార్డుకు చేరువైంది. 2012లో ఢిల్లీ వీధుల్లో జరిగిన హాఫ్ మారథాన్‌ను మాన్ కౌర్ 96 ఏళ్ల వయస్సులో పూర్తి చేసింది. ఇదే వరల్డ్ మాస్టర్స్ ఈవెంట్స్‌లో పాల్గొనడానికి ఆమెకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. 2013లో తైవాన్‌లో ఆసియా మాస్టర్స్ ఛాంపియన్‌షిప్,, టొరంటోలో ఆగస్టులో జరిగిన వరల్డ్ మాస్టర్స్ ఈవెంట్‌లో పాల్గొంది.

ఓ రోజు పరుగు

మాన్ కౌర్ తెల్లవారు జామునే లేచి స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజులు చేస్తుంది. పరుగు మొదలెడుతుంది. తర్వాత గోరు వెచ్చని నీటితో స్నానం చేశాక గురుద్వార్ చేరుకుని గుర్బానీ కార్యక్రమం తిలకిస్తుంది. అక్కడ నుంచి ఇంటికి చేరుకుని ఓ గ్లాసు పాలు తాగి ఆమెకు, కుమారునికి వంట మొదలెడుతుంది. వందేళ్లయినా పూర్తి ఆరోగ్యంగా ఉండటానికి కారణం ప్రతి రోజు ఇంటిలో స్వయంగా వండుకున్న ఆహారం, మంచి అలవాట్లే. ప్రతిరోజు గోధుమ గడ్డి, చిరు ధాన్యాలతో కూడిన ఆహారం వల్లే అంత ఆరోగ్యంగా ఉంటోందని తెలుస్తోంది. వేపుడు కూరలను దరిదాపుల్లోకే రానీయదు. సమయ పాలన పాటించడంలో ఆమెది ఓ ప్రత్యేకత. సాయంత్రం కూడా గుర్బానీ కార్యక్రమానికి హాజరై, రాత్రి తొందరగా పడుకుని వేకువ జామునే లేచి తన కసరత్తును ప్రారంభించడం విశేషం. న్యూజిలాండ్ దేశంలోని ఆక్లండ్‌లో నగరంలో జరిగిన వరల్డ్ మాస్టర్స్ గేమ్స్ 100 మీటర్లు పరుగులో పసిడి పరుగుతో ఆమె ఖ్యాతి దేశ విదేశాలకెక్కింది.



ఓపిక ఉన్నంత వరకు చివర శ్వాస వరకు పరుగు ఆపననే కౌర్ దేశానికి ఇంకెన్ని బంగారు పతకాలు సాధిస్తుందో. కౌర్ సాహసి కూడా. ఆక్లాండ్‌లో స్కై వాక్ చేసి నివ్వెరపరిచింది. పరుగే కాదు అథ్లెటిక్స్‌లో మిగతా క్రీడల్లోను సత్తా చాటేందుకు ప్రయత్నిస్తోంది. జావెలిన్ త్రోలాంటి వాటిల్లో ఇప్పటికే [illegible] ముందుంటోంది.

- ఈశ్వర్ నెట్టెం

తొలి రజతో

తెలుగు సినిమాకు తొలి రజతోత్సవ శోభ తెచ్చిన సినిమాగా 'బాలరాజు' చరిత్రలో నిలిచిపోయింది. ప్రేమికుల కథ ఇది. గ్లామర్, కెమిస్ట్రీ వంటి మాటలు తెలీకున్నా అవి బాగా పండిన చిత్రమిది. అక్కినేని బాలరాజు పాత్రతో యువకులు పోల్చుకునేవారు. రొటీన్‌కు భిన్నంగా వచ్చిన తొలి కథల్లో ఇదొకటి.

ఆ రోజుల్లో సినిమా నిర్మాణం అంటే కత్తిమీద సాములా భావించేవారు. కేవలం సొమ్ములుంటే సరిపోదు. దమ్ములూ కావాలి. అటువంటి దమ్మున్న దర్శకనిర్మాత ఘంటసాల బలరామయ్య. ఆయన్ని చాదస్తపు మనిషి అనేవారు. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అనే ఘటం! లేకపోతే యాదృచ్ఛికంగా అక్కినేనిని చూడటం ఏమిటి? వెనువెంటనే నువ్వు సినిమాల్లో నటిస్తావా? అని అడగడమేమిటి? అడిగి వదిలేయకుండా దాన్ని ఆచరణలో పెట్టడమేమిటి? ఇవన్నీ బలరామయ్య గారి మంకుపట్టుకి నిదర్శనాలు.

సంస్థ నేపథ్యం

ప్రతిభా సంస్థకో ప్రత్యేకత వుంది. నిరంతరం కథా చర్చలు జరుగుతుండేవి. ప్రతిభా శాస్త్రి మంచి చదువరి నిర్మాణ వ్యవహారాలు చూస్తుండేవారు. ఆయన దీక్షాదక్షతలకు మారుపేరు. ఆయన దగ్గర పేకేటి శివరామ్ సహాయకుడు. వీరంతా ప్రతిభ గొడుగు కింద తలదాచుకున్నారు. సంస్థకి పేరొచ్చే పని చెయ్యాలి. సంస్థ నీడలో పది మంది పది కాలాలు బతకాలి. ఇదే లక్ష్యం! ఈ లక్ష్యంతోనే సినిమాలు తీయడం కొనసాగుతుండేది. 'రొటీన్ సినిమా కాకుండా ఏదైనా కొత్తరకంగా ఆలోచించండయ్యా!' అనే వారు బలరామయ్యగారు. ఆ రోజుల్లోనే బలరామయ్య గారు డిఫరెంట్ స్టోరీ కావాలనడం అలవాటు చేశారు. సముద్రాల వారిని పిలిపించి ఈ మాట చెప్పారు. సముద్రాల వారికి అత్యంత సన్నిహితుడు మల్లాది రామకృష్ణయ్య శాస్త్రి. ఇంచుమించు ఇద్దరి భావాలూ ఒకేలా వుండేవి. భావసారూప్యత వారిలో వుంది కాబట్టే కొంతకాలం కలిసి పనిచేయగలిగారు. మొత్తానికి ఒక లైను చెప్పారు. యూనిట్‌లో వున్న వారంతా పెదవి విరిచారు. కానీ అది బాలరామయ్యగారికి నచ్చింది. ఆ కథే బాలరాజు కథ!

కథ ఎలా వండారంటే..

మరుసటి రోజే సముద్రాల వారిని పిలిపించి కథ మీద కూర్చోమన్నారు. లైను బాగా నచ్చింది. ఇది ప్రేమికులకు నచ్చుతుందనే నమ్మకంతో కథా కథనం తృప్తిగా వచ్చే బాధ్యతను సముద్రాల వారికి అప్పగించారు. అంత వరకూ ఆఫీసులోనే ఆయన మకాం. కథా చర్చలు కొనసాగుతున్నాయి. వాటికి ఏ అడ్డంకులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇతర విషయాల్ని శాస్త్రి చూసుకున్నారు. ఇక రాత్రీ పగలూ ఆ పని మీదే కూర్చున్నారు. ఇంటి గురించి ఆలోచించవలసిన అవసరం సముద్రాల వారికి లేదు. మల్లాది వారికి కట్ అండ్ రైట్ పాలసీ. ఏ విషయం గురించీ ఎక్కువ సమయం తీసుకునేవారు కారు. క్షణాల మీద ఆసువుగా కవిత్వం చెప్పేవారు. అది నిత్యనూతనంగా వుండేది. అలాగే కథ విషయంలోనూ ముందుగా ఇలా వుంటుంది అనుకుంటే దానికి ఫిక్స్ అయిపోయేవారు. తరవాత సినిమానైనా వదులుకునే వారు గానీ తన నిర్ణయం మార్చుకునే వారుకాదు. బాలరాజు కథ ఆఘమేఘాల మీద తయారయ్యింది. యూనిట్ సమక్షంలో సముద్రాల వారు ఒక రీడింగ్ ఇచ్చారు. కథ చదవడం ఆయన తర్వాతే! ఎలాంటి వారైనా పడిపోవాల్సిందే! ఆయన వాచక స్పష్టత నచ్చే యన్.ఏ.టి బ్యానరులో చాలా కాలం సముద్రాల వారు ఆస్థాన కవిగా భాసిల్లారు. కథ అద్భుతం!



నటీనటులెవరెవరు

అంజలీ దేవిది చిన్న వేషం. మరి హీరో హీరోయిన్‌ల మాట? హీరో ఇంకెవరు మనవాడున్నాడు కదా! ఆయనే బాలరాజు అన్నారు బలరామయ్యగారు. 'ఏదీ! ఆ కొత్తబ్బాయా? పీలగొంతు.. బక్కపలచటి శరీరం... లోతు కళ్ళు' ఏం బావుంటాడని? పట్టుమని మూడుపదులు నిండని ఆ అబ్బాయిని హీరోని చేస్తారా? కొంతమంది అభ్యంతరం. ప్రతిభాశాస్త్రిగారు పట్టుబట్టారు. ఆ అబ్బాయిని ఎంకరేజ్ చేస్తేనే మంచిది. చెప్పినట్టు వింటాడు అని సమర్ధించారు. అది అక్కినేని మనసులో పడింది.   ఆ కృతజ్ఞతతో అన్నపూర్ణా బ్యానరు సినిమాలకు ప్రొడక్షను వ్యవహారాలు

చూసేందుకు ఆయనకి ఏడుపదుల వయసున్నా ఉపయోగించుకున్నారు. హీరోయిన్‌గా అక్కినేని సమవయస్కురాలైన యస్.వరలక్ష్మిని పరిచయం చేశారు. ఇంతలేసి కళ్లు ముద్దుగా బొద్దుగా వుంది. ముఖ్యంగా గండుకోకిల స్వరం. అందర్నీ మెప్పించింది. అక్కినేని 'బాలరాజు'! తెలుగు తెరమీద మొట్టమొదటి గ్లామరు పాత్ర! ఎలా వుండాలి కొత్తగా కనిపించాలి. కొత్తగా అనిపించాలి. ఆ బాధ్యతని మరో దర్శకుడు యస్.వి.యస్. రామారావు నిర్వహించాడు. చెవులకి రింగులూ, జులపాల జుత్తు.. సన్నని మీసకట్టూ.. భలే అందంగా తయారయ్యాడు. ఎంత అందంగా తయారయ్యాడంటే.. ఆ రోజుల్లో ఎవరైనా సోగ్గా కనిపిస్తే! వీడు బాలరాజురా బాబూ! అనేవారు. అంతెందుకు అక్కినేని మొట్టమొదటి సారిగా అన్నపూర్ణని పెళ్లిచూపులకని చూసింది బాలరాజు గెటప్‌లోనే. అన్నపూర్ణ పుట్టింటివారి ఆస్తిపాస్తులతో పోల్చితే అప్పటి అక్కినేని సంపాదన తక్కువే అయినా ఇష్టపడింది ఆ అందంతోనే! అక్కినేని అందం కట్టిపడేసింది. బలరామయ్యగారికీ అదే కావాలి. నూనూగు మీసాలూ నూతన యవ్వనం ఆడపిల్లల్ని ఆకర్షించే బాకుల్లాంటి కళ్లూ, హాస్యచతురతా, ఇవన్నీ అక్కినేనిలో వున్నాయి. యస్.వరలక్ష్మి కూడా అక్కినేనితో చనువుగా నటించింది. దాన్నే ఇప్పుడు కెమిస్ట్రీ అంటున్నారు. అంత చనువుగా వుండబట్టే వారి మీద పుకార్లు షికార్లు చేశాయి. దానికీ కారణం వుంది. బాలరాజు కథావస్తువు అటువంటిది.

కథా కమామిషూ

ఒక యక్ష కన్య యక్షుడితో ప్రేమలో పడుతుంది. అది తెలుసుకున్న మహేంద్రుడు మండిపడతాడు. మానవలోకంలో పుట్టమని శపిస్తాడు. భూలోకంలో పుట్టిన యక్షుడు బాలరాజవుతాడు. యక్షకన్య సీత

త్సవ చిత్రం

అవుతుంది. ఇక్కడ విశేషమేమిటంటే! సహజంగా హీరో హీరోయిన్ ప్రేమ కోసం పాకులాడుతూ వుంటాడు. అష్టకష్టాలూ పడతాడు. చివర్లో ఎప్పుడో హీరోయిన్ కరుణిస్తుంది. కానీ ఇందులో రివర్సు.. ఎందుకంటే బాలరాజుకి తన ప్రేమ గుర్తుండదు. సీతకి గుర్తుంటుంది. బాలరాజు వెంటపడుతుంది. వారి మధ్య గడిచిన మధుర స్మృతుల్ని గుర్తుచేయాలని ప్రయత్నిస్తుంది. ఆ ప్రయత్నాలు విఫలమౌతాయి. సీత ఎన్నికష్టాలు అనుభవించింది? కథ ఎన్ని మలుపులు తిరిగింది? చివరికి కథ ఎలా సుఖాంతమైంది? అనేదే సినిమా! రొటీన్‌గా వచ్చిన సినిమాలకు భిన్నంగా నిర్మించిందీ చిత్రం. ఇందులో అక్కినేని యస్.వరలక్ష్మిలకు ఎంత పేరొచ్చిందో కస్తూరి, శివరావుకీ అంతే పేరు వచ్చింది. శివరావు కామెడీ ప్రేక్షకులకు బాగా నచ్చింది. జనం విరగబడి చూశారు. ఎంత పేరొచ్చిందంటే... ఫలానా ట్రైనులో శివరావు వస్తున్నాడని తెలిస్తే! ఆ ట్రైనుని ఆపేసేవారు ప్రేక్షకులు. కామెడీ నటుల్లో అంత క్రేజు తెచ్చుకున్న వారు చాలా తక్కువ. అక్కినేని నటన మొట్టమొదటిసారిగా మహిళా ప్రేక్షకుల్ని సమ్మోహనపరిచింది. లేడీస్ ఫాలోయింగ్ అప్పట్నుంచే ప్రారంభమయ్యింది. ఈ సినిమా రిలీజైన తర్వాత కూడా చాలా కాలం బలరామయ్యగారు అక్కినేనిని బాలరాజూ అనే పిలిచేవారు.

సంగీత నేపథ్యం

ఈ సినిమాలో మరో ప్రధానమైన అంశం సంగీతం. గాలి పెంచల నరసింహారావు గొప్ప జ్ఞాని. ఘంటసాల మాస్టారు, సి.ఆర్.సుబ్బురామన్‌ల సహకారంతో స్వరరచన చేశారు. పాటలన్నీ హిట్టే! ఈ చిత్రంతోనే ఘంటసాల అక్కినేని కాంబినేషన్‌లో పాటల ప్రహసనం మొదలయ్యింది. అది ఘంటసాల మాస్టారు బతికున్నంత కాలం కొనసాగింది. అప్పట్లో ఎవరి పాటలు వారే పాడుకునేవారు. అక్కినేని గొంతు మరీ అమ్మాయి గొంతులా వుండేసరికి తప్పనిసరి పరిస్థితుల్లో ఘంటసాల మాస్టారిచేత పాడించారు! అక్కినేని జీవితంలో అదో మధురమైన మజిలీ!

ఓ పాటల పందిరి

బాలరాజు పాటలకు ఆ రోజుల్లో విపరీతమైన స్పందన లభించింది. గాలిపెంచెలవారి స్వర సారథ్యంలో ఘంటసాల వక్కలంక సరళ పాడిన 'నవోదయం-అంభోదయం', 'ఎవరినే-నేనెవరినే' యస్.వరలక్ష్మి పాడిన పాట. కస్తూరి శివరావు పాడిన 'వారాల కూన-నిన్ను', 'ఒకరిని నానవేశా' పాటలు బహుళ ప్రాచుర్యం పొందాయి. 'నీకు నీవారు లేరు- ఓ బాలరాజా' అంటూ వరలక్ష్మి పాడిన ఏపాటకాపాటే జనరంజకమయ్యింది. అక్కినేని యస్ వరలక్ష్మి పాడిన 'చాలు వగలు చెలియా కానరావా...' ఇవన్నీ చాలా కాలం జనం నాల్కల మీద నానుతుండేవి. ఇందులో గాలి పెంచెల వారి స్వరముద్రతో పాటు సుబ్బారామన్న విసుర్లూ, ఘంటసాల మాస్టారి మెలోడీ కనిపిస్తుంది. పాటల విషయంలో ఓ వింతవాదం వుంది. సాహిత్యం సముద్రాల వారిపేరు వున్నా మల్లాదివారి ముద్ర కనిపిస్తుంది. అయితే మల్లాది వారు ఏ రోజూ తన పేరుని గురించి పాకులాడలేదు.



తెలుగు సినిమా చరిత్రలో మొట్టమొదటి గ్లామరు చిత్రం బాలరాజు! హీరో హీరోయిన్ల మధ్య మొట్టమొదట కెమిస్ట్రీ బాగా కుదిరిన చిత్రం బాలరాజు! యస్. వరలక్ష్మి అక్కినేనిలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. పోతే తెలుగు సినిమా చరిత్రలో మొట్టమొదటి రజతోత్సవ చిత్రం బాలరాజు! అలాగే మొట్టమొదటి కమర్షియల్ చిత్రం కూడా బాలరాజే! విడుదలైన అన్ని కేంద్రాల్లో శతదినోత్సవ, రజతోత్సవ, స్వర్ణోత్సవాలు జరుపుకున్న మొట్టమొదటి చిత్రం కూడా బాలరాజే!. ఈ వేడుకలు చూసి అప్పట్లో చాలామంది ధనవంతులు థియేటర్ల నిర్మాణం కోసం ఉవ్విళ్ళూరారు. ఘంటసాల బల రామయ్య ఆశ తీరింది. అక్కినేని గొప్ప నటుడిగా చూడాలనుకున్నారు. చూశారు. బాలరాజు సినిమా ముగ్గురికి మంచి బ్రేక్ ఇచ్చింది. మొదటిది అక్కినేనికి. రెండవది శివరావుకి, మూడవది యస్ వరలక్ష్మికి. ఓ విధంగా స్టార్‌డమ్ సంపాదించిందనే చెప్పాలి.

- ఇమంది రామారావు

చివరి వరకు

నాగేశ్వరరావూ! నువ్వు ఎన్ని సినిమాలన్నా చెయ్యి. కానీ ప్రతి సినిమాకీ మొట్టమొదటి సినిమాకి పడినంత కష్టపడు! నీ మూలంగా ప్రొడ్యూసర్లు ఎన్ని లక్షలయినా లాభం సంపాదించనీ! నువ్వు మాత్రం నీ పారితోషికం పెంచకు!.. ఎందుకంటే ఒకవేళ ప్రొడ్యూసరు నష్టపోతే.. ఆ నష్టాన్ని భర్తీ చేయలేవుగా... ఊరికే నమిలే నోళ్లు సినిమా వాళ్లవి. వాటికి అటుకులు అందించకు! అంటే నిప్పులేకుండా పొగవచ్చే పరిశ్రమ సినిమా పరిశ్రమ! వూరికే పుకార్లు షికార్లు చేస్తాయి. వాటికి ఆస్కారమివ్వకు! చివరిది.. ముఖ్యమైంది ఆరోగ్యమే మహాభాగ్యం. అది కాపాడుకో!" అని ఘంటసాల బలరామయ్య గారు చెప్పారని అక్కినేని ఆత్మీయులతో ఈ మాటల్ని పంచుకోనేవారు. ఆచరణలో ఆఖరి క్షణం వరకూ చూపించారు అందుకే వారు చరిత్రకారులయ్యారు. !

జీవయంత్రం

ఎక్కడో
దూరం నుంచి
ఓ గొంతు వినిపిస్తుంటుంది
భాష భావం రెండూ
తెలుస్తుంటాయి
ముఖం లీలగా కనిపిస్తుంటుంది
ముఖానిదేముందీ అందరికీ ఉంటుంది
మాట మనిషికి ఇస్తుంది స్థిరత్వం
మనిషిని మనిషిగా తీర్చిదిద్దే జీవయంత్రం
వాసన చూసి పూవును గుర్తించినట్టు
కన్మూడిన చీకటిలోనైనా ధ్వనిని బట్టి అస్థిత్వం గుర్తించినట్టు
లోపల గూడుకట్టుకున్న అంతర్జ్వలనానికి ఆజ్యం
పోస్తున్నట్టుంటుంది ఆ చురకుదనం
అపుడే
మౌనాన్ని దేహం నుంచి తరమాలనే
కోరిక పుడుతుంది
ఆ గొంతుతో గొంతు కలపాలని
తహతహ లాడిపోతుంది మనసు
గుండె గొంతైనట్టనిపిస్తుంది చివరకు
మాటల సమూహం హోరు వర్షం రెండూ ఒకటే
గొంతు సముద్రం కదా
మాటల అలలలతో కఠిన శిలల్ని కరిగించే
కెరటసమూహం కదా
గొంతు దీపం కదా
తిమిరఛాయల విసిరికొట్టే
కిరణాల వడిశల కదా.
అప్పటిదాకా తూలిపడుతున్న నామాట
ఇపుడు లేచి నిలబడి నిటారు కెరటం.
నాలో నన్ను చూసుకుంటున్న నిండైన వ్యక్తిత్వం.

-మహమూద్
9441027462

కవిత్వం

నీ కనురెప్పల మాటున...

ఎన్ని భావాల్ని ఒలకబోస్తాయో
మరెన్ని మెరుపుల్ని మెరిపిస్తాయో
చూసీ చూడనట్టు
మాట్లాడీ మాట్లాడనట్టు
ఒక్కోసారి మౌనాన్నీ
మరోసారి మోహాన్నీ...
ఆప్యాయంగా ఆహ్వానిస్తాయి
కాసేపు కసిరేస్తాయి
మత్తెక్కిస్తాయి
ఓరగా
అల్లరి అల్లరిగా
ఆర్తిగా
అమాయకంగా
చిలిపిగా...దీనంగా
అమాంతం హత్తుకునేలా
అరవిరిసిన కమలాలు ఆ కళ్లు
ఆనంద భాష్పాల్ని రాలుస్తాయి
ఆక్రోశాన్నీ..ఆవేదనల్నీ కలగలిపి
సూటిగా ...తీక్షణంగా
రమ్మన్నా...పొమ్మన్నా
నవ రసాలన్నీ కను సైగల్లోనే
ఈర్ష్యలూ...కుట్రలూ
భరించలేక
ఏ నిశీధిలోనో నిద్రలోకి జారుకుంటాయి
ఎన్నో భావోద్వేగాల చూపుల గారడిలో
నిరంతరం నీ కోసం నిరీక్షించే
ఈ కళ్లకు
జీవన్మరణం
నీ కనురెప్పల మాటునే...

-కె.వి.రమణమూర్తి
9491642672

ప్రాణ బంధువు

- ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినం మే 12న ప్రపంచవ్యాప్తంగా నర్సెస్ డేని నిర్వహిస్తున్నారు.
- 1965లో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్ మొట్టమొదటి అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ప్రతిపాదించింది.

- ఆరోగ్య వ్యవస్థలో నర్సింగ్‌ని అంతర్జాతీయ వ్యవస్థగా తయారు చేసేందుకు ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్ 1899లో ఏర్పడింది.



- మొట్టమొదట ఎబోలా వ్యాధిగ్రస్తుడిగా గుర్తించబడిన లిబియా వ్యక్తి లాయర్ ప్యాట్రిక్ సాయర్‌కు వైద్య సేవలందించేందుకు ముందుకొచ్చిన నర్స్ జస్టినా ఒబి ఎజెలోను. ఎబోలా వ్యాధిసోకి కొద్దికాలానికే మరణించిన ఆమెని ఒక ధీర నర్స్‌గా ప్రపంచదేశాలు కొనియాడాయి.

- అమెరికాలో అత్యంత ప్రభావిత మహిళగా పేరొందిన క్లారా బార్టన్ పదేళ్ల వయసులో నర్స్‌గా తొలి ఉద్యోగాన్ని మొదలు పెట్టారు.
- అమెరికా, కెనడా దేశాల్లో ప్రతి ఏటా మే 9-12 మధ్య నర్సింగ్ వారోత్సవాలని నిర్వహిస్తారు. ఫ్లారెన్స్ నైటింగేల్ నూరవ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలు తొలిసారి 1954లో అమెరికాలో అక్టోబర్ 11-16 మధ్య నిర్వహించారు.
- ఇష్టంలేని పెళ్లిని తప్పించుకునేందుకు పదిహేనేళ్ల వయసులో ఇంటి నుంచి బైటికొచ్చిన సరాహ్ ఇమన్ ఎడ్మండ్స్ పుషుషిడి వేషంలో అమెరికన్ యూనియన్ ఆర్మీలో నర్స్‌గా చేరారు.

- పిల్లల సాధారణ సంరక్షణని చూసుకునే మహిళని పిలిచే 'నొరైస్' పదం ద్వారా నర్స్ అనే పదం ప్రచారంలోకి వచ్చింది.

- ఫిలిప్పీన్స్ నర్స్ అసోసియేషన్ (పిఎన్ఎ) వివిధ దేశాల నుంచి ప్రతి ఏటా అక్కడి వేడుకలకి వచ్చే నర్సులతో ఒక మానవ హారాన్ని నిర్వహిస్తుంది.

- యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్‌వేనియా అధ్యయనం ప్రకారం అమెరికాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న వృత్తుల్లో నర్సింగ్ ఒకటి.

- కెనడాలోని ఒంటారియో ప్రాంతానికి చెందిన మేరి ఆగ్నెస్ స్నివిలి నర్సింగ్‌లో శిక్షణ తీసుకున్న తొలి మహిళ. 1884 శిక్షణ తర్వాత సూపరిండెంట్‌గా చేరారు.

- నర్సింగ్ సేవల్లో స్థిరమైన అభివృద్ధిని సాధించేందుకు గొంతు కలపండి (ఎ వాయిస్ టు లీడ్- సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) థీమ్‌తో వివిధ దేశాల్లో 2017 అంతర్జాతీయ నర్సింగ్ డే వేడుకలని జరుపుకోనున్నారు.

- ఒట్టోమన్ రాజ్యంలో1910లో పుట్టిన (ఆన్జెజె గోంగ్జె బొజషు) మదర్ తెరెస్సా తన జీవితకాలంలో ఎక్కువగా కలకత్తాలోని మురికివాడల్లో కుష్టువాధి బాధితులకి నర్స్‌గా సేవలందించారు.
- నర్సింగ్‌లో మహిళకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పడిన తొలి సంస్థ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ లిమిటెడ్‌ని.1916
- 1853-1856 మధ్య చోటుచేసుకున్న క్రిమిన్ యుద్ధంలో తీవ్రంగా గాయపడిన సైనికులకి వైద్య సేవలందించేందుకు ఫ్లోరెన్స్ రాత్రి సమయాల్లోనూ వెనుకాడేవారు కారు. చిన్న లాంతరు సాయంతో వేలాది మంది సైనికులకి వైద్యంచేసిన ఆమెను 'లేడీ విత్ ది ల్యాంప్' అని పిలుస్తారు.

కథ

రాబందుల రెక్కల చప్పుడు... కర్ణకఠోరంగా వినిపించే దాని అరుపు.... ఆ గ్రామంలో ప్రతిధ్వనిస్తోంది. రోళ్లు బద్దలయ్యేలా కాస్తోన్న ఎర్రటి ఎండ... ఏ వీధి చూసినా నిర్మానుష్యంగా వుంది. ఇళ్లన్నింటికీ తాళాలు వేసి వున్నాయి. అక్కడక్కడా ఒకరిద్దరు వృద్ధులు కనబడుతున్నా... వచ్చే ప్రాణం పోయే ప్రాణం అన్నట్టుగా వున్నారు.

చెమటలు కక్కుతూ నడుస్తున్నాడు గోపాలం. పట్టపగలే తన అడుగుల చప్పుడు తనకే భయంగొలిపేలా వినిపిస్తున్నాయి. గొంతెండి పోతోంది. 'ఇంకాసేపు ఇలానే వుంటే కళ్లు తిరిగి పడిపోతానేమో... గుక్కెడు నీళ్లిచ్చే వారు కూడా లేరా? అనంతపురం జిల్లాలో కరువు కరాళ నృత్యం చేస్తోంది. గ్రామాలు గ్రామాలు వలస పోతున్నాయి అంటే ఏమో అనుకున్నా... పరిస్థితి మరీ ఇంత దారుణంగా వుంటుందా?' అనుకుంటూ నడుస్తున్నాడు.

కాస్త దూరంలో గుంపుగా వున్న రాబందులు గోపాలం అడుగుల చప్పుడుకు చెల్లాచెదురుగా

వలస బతుకు

- రాజాబాబు కంచర్ల
9490099231

ఎగిరిపోతున్నాయి.

అక్కడి పరిస్థితి గోపాలం కడుపులో దేవినట్టయింది. కట్టుగొయ్యకు కట్టేసివున్న గేదె దూడను రాబందులు పీక్కుతింటున్నాయి. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతోందది.

ఆ దృశ్యాన్ని చూడలేక గోపాలం కళ్లు మూసుకున్నాడు. కడుపులో దేవినట్టయింది.. వాంతి చేసుకున్నాడు. కళ్లు తిరగడంతో అలాగే కాసేపు నిల్చుండిపోయాడు.

'ఇక్కడే పడిపోతే నన్నుకూడా రాబందులు....' వళ్లు జలదరించింది. అంతకంటే ఎక్కువ ఊహించలేకపోయాడు. సర్వశక్తులూ కూడగట్టుకొని చకచకా నాలుగడుగులు వేశాడు.

'కేర్...'మంటూ చంటిబిడ్డ ఏడుపు.....

ఉలిక్కిపడ్డాడు గోపాలం. చుట్టూ చూశాడు ఎక్కడినుంచా అని. జనసంచారమే కనబడని ఈ ఊర్లో చంటిబిడ్డ ఏడుపా... అనుకుంటుండగానే పక్కనే వున్న ఇంట్లో నుంచి మరోసారి 'కేర్' మంటూ చంటిబిడ్డ ఏడుపు...

ఈ ఇంట్లో ఎవరో వున్నారనుకుంటూ అటువైపు నడిచాడు.

ఏడుస్తూ బయటికొస్తోందో యువతి మూడు పదులు దాటిన వయస్సు తైల సంస్కారం లేక చిక్కుబడిన జుట్టు... బాగా సింకిపోయిన చీరతో పేదరికానికి కేరాఫ్ అడ్రస్‌లా కనిపిస్తోంది.

ఇంటిముందు నిల్చున్న గోపాలాన్ని చూసి నిర్ఘాంతపోయింది. వస్తోన్న దుఃఖాన్ని ఆపుకుంటూ... పవిట చెంగుతో కళ్లు తుడుచుకుంటూ 'ఎవరు?' అన్నట్టు చూసింది గోపాలం వైపు.

'దా... దాహం... దాహంగా వుంది. కాసిన్ని నీళ్లు...'

'చదువుకున్నోడిలా వున్నాడే... ఇంత ఎండలో యాడనుంచి అత్తన్నాడో...' అనుకుంటూ గబగబా లోపలికెళ్లి చెంబుతో నీళ్లు తెచ్చింది....

ఆత్రంగా అందుకున్న గోపాలం గటగటా రెండు గుక్కలు తాగి ఊపిరి పీల్చుకున్నాడు. చేతిలో కాసిని ఒంపుకొని ముఖాన చల్లుకున్నాడు. ప్రాణం లేచొచ్చినట్టయింది. ఓ క్షణం సేదదీరి చెంబు ఖాళీ చేశాడు.

'అన్నా... అట్టా కూసోండి. ఎండనబడొచ్చారు.... ఒక్క పిట్టలేదు ఈ ఊళ్లో... తవరు ఓరింటికెల్లాలె...'

'నేనీ ఊరు పనిమీద వచ్చానమ్మా.... ఊరిలో ఒక్కరూ కనబడ్డంలేదు ఏమయ్యారో' తెలిసినా ఏదోకటి మాట్లాడాలన్నట్టుగా అడిగాడు.

'ఏం సెప్పమంటావన్నా ఊరు ఊరంతా వలసెల్లారు. అక్కడక్కడా ముసలీముక్కా తప్ప ఎవురూ లేరు.'

'నీ పేరేంటి? ఎందుకేడుస్తున్నావు లోపలెవరున్నారు? సస్పెన్స్ తట్టుకోలేనట్టుగా అడిగేశాడు.

'నా పేరు లచ్చిమి... మాది ఆ పక్కిల్లే. ఈడ మా మర్దలు, దానికితోడుగా ముక్కది వుండాది. గిప్పుడే మా మర్దలు పెసవించింది. ఆడపిల్ల... చక్కని బొమ్మలా వుంది'

'అలాగా... అయితే నువ్వెందుకు ఏడుస్తున్నావ్'

'నా బిడ్డ గుర్తొచ్చిందన్నా... అందుకే అంటూ...' మళ్లీ కన్నీరు పెట్టుకుంది.

'ఎక్కడుంది నీ బిడ్డ?'

'అదో పెద్ద కత అన్నా'

ooo

"ఒకప్పుడు మా ఊరంతా పచ్చగా కళకళలాడుతుండేది. వానల్లేక, పంటలు పండక ఏడాదికేడాది కరువు పెరుగుతూ వచ్చింది. అప్పులు చేసి ఏసిన పంట కూడా ఎండిపాయె. ముద్ద గడువుడే కష్టమయ్యె. పేనాలు నిల్పుకోడానికి, బిడ్డల్ని సాక్కోడానికి పక్కనున్న పట్నాలకు, ఇతర రాస్త్రాలకు వలసెల్లాల్సి వత్తాండె. కుటుంబాలకు కుటుంబాలు ఏడ పనిదొరికితే ఆడకి పోతన్నం."

'మరి మీ సంగతేంటి?'

"మాకు ఐదెకరాల భూమి ఉండె. సెనగ ఏసినం. సుక్కనీరు లేక చక్కగా ఎండిపోయింది. గొడ్లు తింటానిక్కూడా పనికిరాలె. చేసిన అప్పులు తీరక, పొట్టగడవక వలస పోతన్నం" అంటూ ఆ గ్రామస్తుల వలస బతుకుల గురించి పూసగుచ్చినట్టు చెప్పింది లచ్చిమి.

'మీ జిల్లాలో రెయిన్‌గన్స్‌తో పంట పొలాలకు నీళ్ళిచ్చామని గవర్నమెంట్ చెబుతోంది కదా..'

'మీకు తెల్వందేముందన్నా... గోరుమెంటోల్లు కూడా పెద్దోల్ల పచ్చమే. ఆల్లకే చాల్లేదు. మాదాకా యాడొత్తయ్. పేదోడ్ని పట్టిచ్చుకునేటోల్లు యాడున్నరు. ఆల్లు పట్టించుకుంటే మాకెందుకీ తిప్పలు....'

'నీ బిడ్డ ఎక్కడ? నీ భర్త కూడా వలసెల్లాడా?'

ఒక్కసారిగా బావురుమంది లచ్చిమి.

'ఊరుకో లక్ష్మీ..... ఊరుకో.. అసలేం జరిగింది? ఆత్రంగా అడిగాడు గోపాలం.

"ఆ గోరాన్ని ఎట్టా సెప్పమంటావ్ అన్నా... ఊరందరితో పాటే నా పెనిమిటి రావుడు, మా మూడేల్ల బిడ్డ సీతమ్మతో పాటు మేము గుంటూరుకు వలసెల్లినం. రెండ్రోజులు రోడ్డుపక్కనే గడిపాం. చివరికి దూదిమిల్లులో పని దొరికింది. మిల్లు పక్కనే ఓ గుడిసెలో కాపురం పెట్టాం. సుబ్రం చేసిన దూదిని బత్తాల్లో నింపి, ఆ బత్తాల్ని ముందునుంచి పట్టుకొని ఎనక్కి ఇసరాల. అట్టా గుట్ట పడిన బత్తాల్ని లారీల్లో లోడు చేసుకుపోతారు. అలవాటులేని పనికావటంతో మొదట్లో గూళ్లు పులిసిపొయ్యేవి. ఏదో నాల్గు మెతుకులు తినగల్గుతున్నం. చంటిబిడ్డకు పస్తులేకుండా వుండాది. అదే చాలనుకున్నం.

ఓ రోజు గుడిసెకొచ్చేసరికి మా సీతమ్మ కనబడలేదు. ఆ చుట్టుపక్కలంతా ఎతికాం. రాత్రంతా జాగరం చేసినం. తెల్లారి పదిగంటల పొద్దుకాడ మాతోపనిజేసే ఎంకటేసు ఆదరాబాదరా అచ్చి మిల్లుకాడికి తోలుకపొయ్యాడు. అప్పటికే అక్కడంతా కూలోల్లు గుమికూడున్నారు. లోపలికెల్లి చూస్తిమిగందా... దూదిసంచుల కింద శవమై కనిపించిందన్నా... నా చిట్టితల్లి సీతమ్మ..... " అంటూ బోరున విలపించింది.

అది వింటున్న గోపాలం కళ్లు చెమర్చాయి. గద్గదస్వరంతో... 'అయ్యో... ఎట్లా జరిగిందమ్మా... అసలు సీతమ్మ అక్కడికెందుకొచ్చింది..?'

'మా గాచ్చారం బాగోలేదన్నా... మా గుడిసెలు కూడా మిల్లు పక్కనే.. ఆడుకుంటూ అటొచ్చి మేము ఇసిరిన బత్తాల కిందే పడిపోయింది. చేజేతులా నా బిడ్డ పేనాలు తీసుకున్నాం....'

ఆ కన్నతల్లి కడుపుశోకం ఆరడంలేదు. వెక్కివెక్కి ఏడుస్తూనే వుంది..

'చాలా ఘోరం జరిగిందమ్మా... కరువు ఎన్నిరకాలుగా ప్రాణాలు తీస్తుందో ఈ ప్రభుత్వాలకు పట్టడంలేదు...' ఒకింత ఉద్వేగంగా అన్నాడు గోపాలం.

కాస్త



తమాయించుకోని 'ఇంతకీ నీ భర్త ఎక్కడ? ఇది జరిగి ఎన్నాళ్లయింది?

'ఎన్నాళ్లో యాడన్నా.. రెండోరాలైంది. నా సీతమ్మని బలిగొన్న ఆ మిల్లుకాడ వుండలేక నేనొచ్చేసినా. నా పెనిమిటి ఆడనే కూలి చేత్తన్నాడు.'

'సరే లక్ష్మీ గుండె రాయి చేసుకో. నేనిక బయల్దేరతా...' లేచాడు గోపాలం.

'అన్నా... కూడుతినే ఏల కూడా దాటిపొయ్యింది. నువ్వు ఎంగిలిపడినట్టు కూడానేదు. కాసింత జావ తాగిపొండి' అంటూ గబగబా లోపలికెళ్లి గ్లాసుడు జావ తెచ్చింది.

కరువు కోరల్లో చిక్కిన ఆ ఊరి సజీవ దృశ్యం ఒకవైపు... లక్ష్మి కుటుంబ విషాద గాథ మరోవైపు గోపాలం హృదయాన్ని కలిచివేసింది.

'వద్దమ్మా ఈ ఊరి పరిస్థితి చూసి గుండె బరువెక్కింది. కాసిన్ని మంచినీళ్లివ్వు చాలు'

ఏమనుకుందో.... మౌనంగా లోపలికెళ్లి నీళ్లు తెచ్చింది.

ఆ నీళ్లతో పాటు బాధనంతా దిగమింగి భారమైన మనసుతో వెనుదిరిగాడు గోపాలం.

ooo

గుంటూరు- విజయవాడ నాన్‌స్టాప్ బస్సు విజయవాడ వైపు వేగంగా దూసుకుపోతోంది. ఆ బస్సులో విండో పక్క సీటులో కూర్చున్నాడు గోపాలం. కళ్లవెంట ధారాపాతంగా కన్నీళ్లు.... మధ్యమధ్యలో వెక్కెక్కి పడుతున్నాడు.

చాలా సేపటి నుంచి గోపాలాన్నే చూస్తోన్న పక్కసీటతను 'మాస్టారూ.... మాస్టారూ....' అంటూ గట్టిగా కుదిపాడు.

ఉలిక్కిపడిన గోపాలం... బిత్తరపోతూ అతనివైపు చూశాడు.

'ఏంటి మాస్టారూ...ఏమైంది? చాలా సేపటినుంచి చూస్తున్నా... వెక్కివెక్కి ఏడ్చేస్తున్నారు...'

అప్పుడు బాహ్యాప్రపంచంలోకి వచ్చిన గోపాలం చుట్టూ చూశాడు. ఒకరిద్దరు తనవైపే చూస్తున్నారు ఆశ్చర్యంగా... పక్కనతను ఇంకా తనవైపే చూస్తున్నాడు ఏం చెబుతాడోనని ఆసక్తిగా

బ్యాగ్‌లో నుంచి వాటర్ బాటిల్ తీసి రెండు గుటకలు వేశాడు. కర్చీఫ్‌తో ముఖమంతా తుడుచుకున్నాడు. బాటిల్ పట్టుకొనే కళ్లు మూసుకున్నాడు.

వేగంగా వెళుతున్న బస్సుకు ఏదో అడ్డురావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. ఆ కుదుపుకు గోపాలం తల ఎదురు సీటుకి గుద్దుకుంది.

నొసలు రుద్దుకుంటూ సరిగా కూర్చున్నాడు. అప్పటికి గానీ గోపాలం దిమ్ము తగ్గలేదు.

'మీ పేరేంటి మాస్టారూ..?' విషయమేంటో తెలుసుకోవాలనే కుతూహలం ఆ గొంతులో కనిపిస్తోంది.

'గోపాలం'

'ఓ... ఏం చేస్తుంటారు?'

'జర్నలిస్టుని'

'అవునా... మరెందుకండీ... ఇందాక మీరలా...'

'ఏదో సంఘటన జ్ఞాపకం వచ్చిందిలెండీ...'

'మిమ్మల్ని అంత బాధపెట్టిన ఆ సంఘటనేంటి మాస్టారూ.. నాకు తెలుసుకోవాలని ఆసక్తిగా వుంది..'

'అదా... అది ఒక ఊరికథ. కరువు కోరల్లో చిక్కి... పిడికెడు మెతుకుల కోసం కడుపు చేతపట్టుకొని వలసెళ్లిన మనుషుల యథార్థగాథ. కన్నబిడ్డను చేజేతులా పోగొట్టుకున్న ఓ తల్లి కడుపుకోత కథ...' అంటూ జరిగిన కథంతా చెప్పాడు.

'మరి ముఖ్యమంత్రి అన్నికోట్లు ఖర్చుపెట్టాం... ఇన్నికోట్లు ఖర్చుపెట్టాం.. కరువును పారదోలాం అని చెబుతాడు- రాష్ట్రం ఇంత దారుణంగా వుంటేనూ...'

నవ్వి ఊరుకున్నాడు గోపాలం...

'అవును మాస్టారూ... ఇది జరిగి ఎంతకాలమైంది' సడన్‌గా ఏదో గుర్తొచ్చినవాడిలా అడిగాడు.

'నాలుగు నెలలు'

'మీరేం అనుకోనంటే నాకింకో సందేహం...'

'ఆలస్యమెందుకు అడగండి' అన్నట్టుగా చూశాడు..

'మరి... మీరు ఇప్పుడెందుకు కన్నీళ్లు పెట్టుకున్నారు. నాలుగునెల్ల క్రితం జరిగిన ఇప్పుడెందుకు గుర్తొచ్చింది...'

"అదీ... వలస కార్మికులపై వార్తలు రాయడం కోసం అనుకోకుండా ఒక కాటన్ మిల్లు దగ్గరకు వెళ్లా. అక్కడి కార్మికులతో మాట్లాడుతుంటే... అప్పుడు పరిచయమయ్యాడు రాముడు. అదే.. లక్ష్మి భర్త.

వాళ్ల ఊరు వెళ్లిన విషయం, తన భార్యను కలిసిన విషయం చెబితే కన్నీళ్లు పెట్టుకున్నాడు."

'ఇల్లు, పొలం పుట్రా అన్నీ వుండి కూడా పొట్టకూటి కోసం ఊళ్లుపట్టుకు తిరగాల్సిన దుస్థితి పట్టిందన్నా మాకు. మా చిన్నితల్లి సీతమ్మను పొట్టనపెట్టుకున్న భూతం అన్నా ఈ మిల్లు' కన్నీళ్లు పెట్టుకున్నాడు.

'ఒక్కడివే ఇక్కడెలా వుంటున్నావ్'

'అదేంటన్నా... నా చిట్టితల్లి సమాధి కూడా ఇక్కడేగదా వుంది. రోజుకోసారన్నా చూడకపోతే వుండలేకపోతన్నా..' అంటూ ఏడ్చేశాడు.

అయ్యో ఎందుకు కదిలించానా అని తన్నుతాను తిట్టుకున్నాడు గోపాలం.

'సరే రాముడు... జాగ్రత్త...' అంటూ కాస్త దూరం వచ్చిన తర్వాత వెనక్కితిరిగి చూశాడు. రాముడింకా అక్కడే వున్నాడు.

'ఇలారమ్మంటూ..' చెయ్యి ఊపాడు గోపాలం.

దగ్గరకొచ్చిన తర్వాత..

'రాముడూ... సీతమ్మ సమాధి చూడాలనివుంది. తీసుకెళతావా..?'

రాముడి ముఖం ఒక్కసారిగా వెలిగిపోయింది.

'రండి బాబూ.. ఎల్దాం' అంటూ తీసుకెళ్లాడు.

ooo

చెప్పడం ముగించి.... అతనివైపు చూశాడు.

'మాస్టారూ... వింటున్న నాకే ఇంత బాధగా వుంటే... కళ్లారా చూసిన మీరెంత బాధపడివుంటారో... అసలు ఈ ప్రభుత్వాలు...' అంటూ మంత్రుల్ని, అధికారుల్ని తిట్టడం మొదలెట్టాడు.

'ఫైర్ స్టేషన్'.... కండక్టర్ కేకతో గబగబా బస్సు దిగాడు గోపాలం.

'రాష్ట్రంలో కరువు వెతలు - వలస బతుకులు' అనే అంశంపై వరస కథనాలు రాయడానికి ప్లాన్ చేసుకుంటూ తన ఆఫీసువైపు నడిచాడు భారమైన హృదయంతో....

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

పౌర కేఫ్‌ల్లో ఓ రెండు గంటలు

ఈ కేఫ్‌లో నాలుగు కబుర్లు వింటే ఇంకో కప్పు పౌరుడిగా మీరు తయారవుతారు. ఓ రెండు గంటలు గడిపేస్తే పౌర సమాజంలో టేబుల్ రిజర్వ్ చేసుకుంటారు. సిటిజన్ కేఫ్‌గా పిలిచే ఈ కేఫ్‌లో రాజ్యాంగం, పౌర హక్కులపై అవగాహన కాఫీతో పాటు అందిస్తారు. ఇక్కడి నుంచి వెళ్లిన చాలామంది పౌరులు ఎన్నో సమస్యలకు పరిష్కారాలను డిమాండ్ చేసి ప్రభుత్వం నుంచి చేయించుకున్నారు. రోడ్డు పని నుంచి ఆర్టీఐ వరకు ప్రతి పని గురించి నిలదీస్తున్నారు.

ఇలాంటి కేఫ్‌లు ఇప్పుడిప్పుడే దేశంలో విస్తరిస్తున్నాయి. హర్యానా నుంచి కర్నాటక దాకా ఎన్నో వేల పనుల్ని ప్రభుత్వం నుంచి చేయించుకున్నాయి. యువత నడిపే ఈ సిటిజన్ కేఫ్‌లు పాఠశాలలు, కళాశాలలు, నివాస సముదాయాల్లో నడుస్తున్నాయి. 'వీ ద పీపుల్' అనే సామాజిక సంస్థ వీటికి అంకురం వేసింది. వినితా సింగ్ అనే యువతి ఆలోచనే ఇది. పౌరుల ప్రాథమిక హక్కులను తెలుసుకుని వాటి ద్వారా తమ కనీస అవసరాల్ని ప్రభుత్వం నెరవేర్చేలా ఉద్యమ బాట పట్టడమే దీని ఉద్దేశం. పాఠ్యాంశాల్లో ఎంత చదువుకున్నా అది బట్టీయమే కావడంతో ప్రాక్టికల్‌గా వాటిని ఎలా వాడుకోవాలో తెలీదు. చాలా మందికి చట్టం గురించి అస్సలు అవగాహన లేదు. వీరందరికీ మళ్లీ రాజ్యాంగంలోని ముఖ్య విషయాల గురించి తేలికగా అర్థమయ్యేలా చెప్పి వాటిని నిజజీవితంలో వినియోగించుకునేలా ప్రోత్సహించడం సిటిజన్ కేఫ్‌ల లక్ష్యం. వీటితో పాటు మానవీయ విలువలు, యువత బాధ్యతల గురించి కూడా చర్చిస్తారు. కేవలం కబుర్లతోనే సరిపెట్టేయక పౌర ఉద్యమాల్లో పాల్గొనేలా స్ఫూర్తినింపుతారు. మొదట్లో కొందరి ఆలోచనల్ని ఒకరికొకరు చెప్పుకునే విధంగా మొదలై ఇప్పుడు వేలాది మందిని దేశం ఎదుర్కుంటున్న పెద్ద సమస్యల గురించి చర్చించుకునేలా చేస్తోంది. స్థానిక ప్రభుత్వాల తీరు, పథకాలకు దరఖాస్తు చేసుకునే విధానం, సమస్యల్ని వివరించడం, సమాచారాన్ని పొందగలగడం వంటి ఎన్నో విషయాలపై అవగాహన కల్పిస్తాయి సిటిజన్ కేఫ్‌లు.



విద్యార్థుల చైతన్యం

సిటిజన్ కేఫ్‌లు ఎంత విజయవంతమవుతోంది తెలుసుకునేందుకు అస్సాంలోని జోర్హాట్ బాస్కో ఇనిస్టిట్యూట్ విద్యార్థుల ఉద్యమాన్ని తీసుకోవచ్చు. రాజ్యాంగం గురించి సిటిజన్ కేఫ్‌ల ద్వారా తెలుసుకున్న వారు తమ రాష్ట్రాలైన మిజోరాం, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్‌లకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. కేఫ్‌ల్లో నాయకత్వం వహించేది, చర్చలను ముందుకు తీసుకువెళ్లేది యువతే. వాళ్లే కేఫ్‌లను నిర్వహిస్తూ పెద్దవారిని కూడా తమ చర్చల్లో మాట కలిపిస్తుంటారు. వీరిలో 15 ఏళ్ల వాళ్లు కూడా ఉంటారు.





విద్యార్థులే కాదు వారి తల్లిదండ్రులు కూడా వీటిల్లో ఉత్సాహంగా పాలుపంచుకుంటున్నారు. ప్రస్తుతానికి 70 మంది వలంటీర్లు పూర్తిగా శిక్షణ తీసుకుని దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఈ కేఫ్‌లను నిర్వహించడంలో విద్యార్థులకు సాయపడుతున్నారు.

పది మందితో మొదలై...

2006లో ముంబైలో పది మందితో మొదలైన ఓ బృందం ఆ తర్వాత 2010 నాటికి ఏడు ట్రస్టీల్ని, 30 మంది వ్యాఖ్యాతల్ని పోగేసుకుంది. ప్రస్తుతం 200 మందికి పైగా వ్యాఖ్యాతలు, 4 వేల మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. తొలి కేఫ్‌ను ముంబైలోని చర్చి గేట్ కేసీ కళాశాలలో 2012 నవంబర్ 26న ఏర్పాటు చేశారు. అదే ఏట 20 సిటిజన్ కేఫ్‌ల్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రారంభమై నాలుగేళ్లు పూర్తవక ముందే ఇప్పటికి 45కు పైగా కేఫ్‌లు ఎనిమిది రాష్ట్రాల్లో పూర్తిగా పనిచేస్తున్నాయి. నవంబర్-జనవరి మధ్య మరో 16 రాష్ట్రాల్లో తాత్కాలిక కేఫ్‌లను నడుపుతారు. వీటిల్లో 1500 మంది పైగా పాల్గొన్నారు. 2018 నాటికి పది లక్షల మంది పౌరుల్ని చర్చల్లో పాల్గొనేలా కార్యక్రమాలు రూపొందించుకుంటున్నారు ఈ కేఫ్‌ల్లో. బిట్స్ పిలాని వంటి విద్యాసంస్థల నుంచి కూడా విద్యార్థులు వచ్చి వలంటీర్లుగా శిక్షణ తీసుకుని తమ కుటుంబాల్లో, ఊళ్లల్లో రాజ్యాంగం గురించి చర్చించేందుకు కృషి చేస్తున్నారు. చర్చాంశాల్లో 6 విభాగాల్ని ముందుంచుతారు. పౌరుల బాధ్యతలు, హక్కులు, చట్ట రూపకల్పన, ప్రభుత్వ యంత్రాంగం, ఆర్టీఐలపై ముఖ్యమైన అంశాల్ని వివరిస్తారు. ఈ ఆరు విభాగాలపై పట్టు సాధించిన వారిని వ్యాఖ్యాతలుగా ప్రమోట్ చేస్తారు. ◆

పల్లె పాటల 'దణి'

ఇవి హొసూరు కతలు.... పల్లె పాటల కతలు. ఈ కతలు మొత్తం పాటలు, పద్యాలు, గువ్వల తెలుగు పలుకులతో నిండి వుంటాయి. కనుమరుగైపోతున్న జానపద సాహిత్యాన్ని వెలికితీసి... దానికి సరికొత్త సొబగులు అద్ది... జనరంజకం చేసిన ఘనత అగరం వసంత్ గారిది. 'దణి' పేరుతో ఆయన వెలువరించిన హొసూరు కతలు రచయిత సాహిత్యాభిలాషకు నిదర్శనం. తమిళనాడుకు ఒక కొసన వున్న హొసూరు ప్రాంతంలో పామరులైన వృద్ధుల నాల్కలపై అలవోకగా నర్తించే పాటలను సేకరించి, వాటికి రసవత్తరమైన కతలను జోడించి హొసూరు యాసలో గుభాళింపజేశారు. 'హొసూరు తావులో ఇప్పటికీ ఇక్కడి ప్రజలే కాదు పక్షులు కూడా తెలుగు 'దణి'ని పలుకుతాయి' అంటారు రచయిత. 'దణి'– అంటే... ధ్వని, పలుకు, శబ్దం. ఈ సంపుటిలో 126 పాటలున్నాయి. ఈ పాటలన్నింటికీ సజీవ పాత్రలను సృష్టించి, చమత్కారమైన సంభాషణలతో రక్తి కట్టించారు. దీనికోసం ఆయా గ్రామాల్లో తిరిగి, ఇప్పటికీ పాటలు

పుస్తకం పేరు : దణి
రచయిత : అగరం వసంత్
పేజీలు :207,
వెల :రూ.100
ప్రతులకు : ఎ.వసంత్, కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం, హొసూరు, తమిళనాడు.09488330209, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో

పాడుతున్న వృద్ధులను గురించి, వారినుంచి ఆ పాటలను రికార్డ్ చేసి... వాటికి అక్షర రూపం ఇవ్వడమంటే... మామూలు విషయం కాదు. ఇదొక యజ్ఞం. ఈ జానపద సాహిత్యమంతా ఆ వృద్ధ తరంతోనే అంతరించిపోకుండా... భవిష్యత్తరాలకు అందించాలనే తపన, కృషి నిజంగా అభినందనీయం. ఈ సంపుటిలోని గేయాలను, పాడిన గాయకులకే అంకితమియ్యడం కళ పట్ల రచయిత చిత్తశుద్ధికి నిదర్శనం. "ఆ కొండ ఈకొండ నట్టనడుమ నందికొండ/ నందికొండలోన నాది పుట్నిల్లు/ కట్టూరికారి మా వదిన పువ్వు యియ్యమ్మ/ నువ్వు పొయ్యే దోవలో అంగడి వుంది తీసుకోవమ్మా../ కట్టూరికారి మా వదిన పసుపు కుంకుమలే యియ్యమ్మ.../ నువ్వు పొయ్యే దోవలో గుడి వుంది ఆడ నువ్వు పెట్టుకోవమ్మా..." అంటూ అవ్వ నోట పలికే పాట. ఈ పాటకు అర్థం ఏంటని రచయితే అడుగుతాడు. దానికి అవ్వే విడమర్చి అర్థం చెప్పడం... ఇలా ఒక సంభాషణతో 'పుట్టినిల్లు' కతను రక్తి కట్టిస్తాడు రచయిత. అలాగే... "చిలకవన్నె చీర తెచ్చి– నెమలి కన్ను రవిక తెచ్చి/ నెలా ముప్పయినాళ్లు – పెండ్లి గనముగా చేసినారు" అంటూ వినిపించే ఒక పాటకు– మన బిడ్డకి కూడా అట్లాగే పెళ్లి చెయ్యాలని మొగుడు అంటే... అంత పురసత్తు (సత్తా) మనకుందా అని భార్య అనడం– ఇలా 'చిలకవన్నె చీర కట్టె' కత ఆసక్తికరమైన సంభాషణతో సాగుతుంది. తెలుగునాట ఎన్నెన్నో యాసలతో లాలి పాటలు మొదలుకొని శ్రామిక గీతాల వరకూ అసంఖ్యాకమైన పాటలు, పదాలు పల్లెల్లో వృద్ధుల నోట జాలువారుతుంటాయి. వాటినన్నింటినీ సేకరించి, ఒక విందుభోజనాన్ని సిద్ధం చేశాడు రచయిత ఈ సంపుటిలో. భాష పట్ల, జానపదం పట్ల, పల్లెపదాల పట్ల ఆసక్తి వున్న ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదవాలి.

- కె.ఎక్స్.రాజు

స్వీకారాలు

పెట్టుబడి తెలుగులో...



పెట్టుబడి (మూడు భాగాలు)

రచన : రాచమల్లు రామచంద్రా రెడ్డి, బిట్రగుంట రామచంద్రరావు, గడ్డం కోటేశ్వరరావు, ఎ.గాంధీ, సొదుం రామ్మోహన్ (అనువాదం)
పేజీలు : 2,071, ధర : 1000/- (నిజ ధర 1699/-)
లభించు చోటు : విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్‌షాపులలో పుస్తకాలు లభిస్తాయి.

కార్ల్‌మార్క్స్ రచించిన 'పెట్టుబడి' గ్రంథాన్ని విశాలాంధ్ర ప్రచురణాలయం వారు ఈ సంవత్సరం ఫిబ్రవరిలో తెలుగులో రెండవసారి ముద్రించారు. కార్ల్ మార్క్స్ పెట్టుబడీ గ్రంథాన్ని మొదటిసారి ప్రచురించి 150 సంవత్సరాలు అవుతున్నది. పెట్టుబడ దారీ వ్యవస్థ ఎదుర్కొం టున్న సంక్షోభానికి కారణాలు, దాని పరిష్కార మార్గాలను పెట్టుబడి గ్రంథం స్పష్టం చేస్తుంది. కార్ల్‌మార్క్స్ సరుకు విశ్లేషణతో పెట్టుబడి గ్రంథాన్ని ప్రారంభిం చాడు. సరుకులో విలువ, ఉపయోగపు విలువ ఉంటాయని చెప్పాడు. సరుకుకు విలువ ఏర్పడటానికి కారణం అందులో ఉన్న మానవ శ్రమ కారణమని చెప్పాడు. పెట్టుబడిదారులు కార్మికుని శ్రమశక్తిని చౌకగా కొనుగోలు చేస్తారని, శ్రమను వినియోగించుకొనే క్రమంలో కార్మికుని నుండి అదనపు శ్రమను రాబడతారని, పెట్టుబడిదారులు పొందే అదనపు విలువకు కార్మికుల నుండి దోపిడీ చేస్తున్న అదనపు శ్రమయే కారణం అని విశ్లేషించాడు. ఆ విధంగా పెట్టుబడిదారులు దోపిడీచేస్తున్న అదనపు విలువ లాభం రూపంలో పోగుపడుతుంది. పోగుపడుతున్న అదనపు విలువను తిరిగి పెట్టుబడిగా పెట్టి, ఉత్పత్తిని విస్తరించటానికి పెట్టుబడిదారులు పూనుకుంటారు. పెట్టుబడిదారీ విధానం విస్తరి స్తుంది. సరుకుల ఉత్పత్తి పెరుగుతుంటుంది. ఉత్పత్తి అయిన సరుకులను అమ్ముకుంటేనే పెట్టుబడిదారునికి లాభం చేతికి వస్తుంది. సమాజంలో ఉత్పత్తి అయిన సరుకులను కొనుగోలు చేయటానికి సరిపోయినంత డబ్బు కార్మికులు, సామాన్య ప్రజల వద్ద ఉంటేనే ఉత్పత్తి అయిన సరుకులన్నీ అమ్ముడవుతాయి. కాని పెట్టుబడిదారులు శ్రమశక్తిని చౌకగా కొనుగోలు చేస్తూ, కార్మికవర్గాన్ని దోపిడీ చేయటం వలన మార్కెట్లో ఉన్న సరుకులను కొనుగోలు చేయటానికి తగినంత ధనం కార్మికుల వద్ద ఉండదు. కాబట్టి మార్కెట్లోని సరుకులు అమ్ముడు కాక మిగిలిపోతాయి. కాని పెట్టుబడిదారులు ఉత్పత్తిని విస్తరిస్తూ, సరుకుల ఉత్పత్తి నిరంతరం పెంచుతుంటారు. ఫలితంగా ప్రతి ఏడెనిమిది సంవత్సరాల కొకసారి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం సంక్షోభంలో చిక్కుకు పోతుంటుంది. పెట్టుబడిదారులు సంక్షోభం నుండి బయట పడటానికి తీసుకునే చర్యల వలన తాత్కాలికంగా సంక్షోభం నుండి బయట పడ్డట్లుగా కనిపించినప్పటికీ, క్రమంగా ఆ వ్యవస్థ మొత్తంగానే మరింత లోతైన సంక్షోభంలో కూరుకుపోతుం టుంది. వ్యవస్థీకృతమైన పెట్టుబడిదారీ విధాన సంక్షోభం ఆ వ్యవస్థను అంతం చేయటంతోనే పరిష్కారం అవుతుంది.

పెట్టుబడి గ్రంథాన్ని వివిధ వర్గాల ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళ్ళటానికి కృషి చెయ్యటం ద్వారా ఆ లక్ష్యాన్ని సాధించటం సులభం అవుతుంది. అందుకు దోహదం చేసే ఈ గ్రంథం మూడు భాగాలను రాచమల్లు రామచంద్రారెడ్డి, బిట్రగుంట రామచంద్రరావు, గడ్డం కోటేశ్వరరావు, ఎ. గాంధీ, సొదుం రామ్మోహన్ గార్లు సరళంగా అనువాదం చేశారు.

- ఎ.కోటిరెడ్డి



చాక్లెట్ లస్సీ



కావాల్సిన పదార్థాలు

వెన్న తీసిన పెరుగు-200 గ్రాములు
డార్క్ చాక్లెట్ చిప్స్-100గ్రాములు
కోకో పౌడర్-2 టేబుల్ స్పూన్లు
బాదం పలుకులు-10
పంచదార-2 టేబుల్ స్పూన్లు
ఉప్పు- చిటికెడు
ఐస్ ముక్కలు- సరిపడా

తయారుచేసే విధానం

ఒక మందపాటి పాత్ర తీసుకుని అందులో చాక్లెట్ చిప్స్, కోకో పౌడర్, 3 టేబుల్ స్పూన్ల నీరు పోసి స్టౌపై వుంచాలి. చిన్న మంటపై ఉంచి చాక్లెట్ పూర్తిగా కరిగేలా కలుపుతుండాలి. కోకో పౌడర్ చాక్లెట్ పూర్తిగా కరిగిన తర్వాత స్టౌ ఆఫ్ చేసి ఈ మిశ్రమాన్ని కొద్ది సేపు చల్లారనివ్వాలి. మరో పాత్ర తీసుకుని అందులో బాదం ముక్కలు వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మిక్సీ జార్‌లో పెరుగు కొద్దిగా నీరు, పంచదార, చిటికెడు ఉప్పు వేసి బాగా బ్లెండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక పొడవాటి జార్‌లోకి తీసుకుని ఐస్‌ముక్కలు వేసి కలుపుకోవాలి. చివరిగా సర్వింగ్ గ్లాసుల్లో చాక్లెట్ లస్సీని పోసి వేయించి పెట్టుకున్న బాదం పలుకులతో గార్నిష్ చేసి అతిథులకందించండి.

మ్యాంగో లస్సీ

కావాల్సిన పదార్థాలు

వెన్నతీసిన పెరుగు-1కప్పు
మామిడి రసం-3/4 కప్పు
పంచదార-2 టేబుల్ స్పూన్లు
యాలకుల పొడి-1 టీ స్పూన్
ఐస్ ముక్కలు -సరిపడా

తయారుచేసే విధానం

ముందుగా మామిడి పండుని శుభ్రంగా కడిగి ఒక బౌల్లో రసాన్ని తీసి పక్కన పెట్టుకోవాలి. మిక్సీ జార్‌లో పెరుగు, పంచదార వేసి బ్లెండ్ చేసుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమంలో మామిడి రసాన్ని కూడా వేసి మరోసారి బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక పొడవాటి జార్‌లోకి తీసుకుని కాస్త నీరుని చేర్చి బాగా కలుపుకోవాలి. చివరిగా యాలకుల పొడి, ఐస్ ముక్కలు వేసి మరోసారి కలపాలి. చల్ల చల్లని మ్యాంగో లస్సీని సర్వింగ్ గ్లాసుల్లో పోసి కొద్దిగా యాలకుల పొడితో గార్నిష్ చేసి అతిథులకందించండి.

నేపాలి స్టైల్ పుదీనా లస్సీ

కావాల్సిన పదార్థాలు

పెరుగు- 2 కప్పులు
పుదీనా ఆకులు-10
పాలు- 1 కప్పు
జీలకర్ర పొడి-1 టీస్పూన్
యాలకుల పొడి-1 టీ స్పూన్
పంచదార-1టీస్పూన్
ఉప్పు-చిటికెడు
ఐస్ ముక్కలు సరిపడా



తయారుచేసే విధానం

ముందుగా మిక్సీ జార్‌లో పెరుగు కొద్దిగా నీరు, జీలకర్ర పొడి, యాలకుల పొడి, పంచదార, ఉప్పు, పుదీనా ఆకులు వేసి బ్లెండ్ చేసుకోవాలి. ఒక పాత్రలో పాలు, బ్లెండ్‌చేసి పెట్టుకున్న లస్సీ మిశ్రమాన్ని తీసుకుని అందులో కొన్ని ఐస్ ముక్కలని వేసి బాగా కలుపుకోవాలి. చివరిగా సర్వింగ్ గ్లాసుల్లో లస్సీని పోసి పుదీనా ఆకులతో గార్నిష్‌చేసుకోవాలి.

రంగులు అద్దండి

అతికిద్దాం

చింటూకి ఈ మధ్య అల్లరి మరీ ఎక్కువైపోయింది. కోడిపిల్ల బొమ్మను కత్తిరించి అతికించకుండా వెళ్లిపోయాడు. ఇక్కడిచ్చిన బొమ్మ ఆధారంగా మీరు దాన్ని జాగ్రత్తగా అతికించేయండి.



బొమ్మలు పూరించండి

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ జిరాఫీ బొమ్మని ఎలా గీయాలో ఇక్కడ ఇచ్చాడు. మీరూ ప్రయత్నించండే!



తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో 10 తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించి సున్నాచుట్టేయండి.



పదాలు గుర్తిద్దాం

పిల్లలూ! మీకు తెలిసిన కొన్ని వస్తువులు, జంతువుల పేర్లను ఇక్కడుంచాం! పక్కన వున్న అక్షరాల పట్టికలో అవెక్కడున్నాయో గుర్తించి పెన్నుతో మార్క్ చేయండి.

moon
boat
crab
deer
cloud
chair

j	o	w	t	r	a
m	c	d	q	c	r
o	r	e	b	l	i
o	a	e	o	o	a
n	b	r	a	u	h
s	v	o	t	d	c

తేడాలు గుర్తించండి!

గిటార్ వాయిస్తున్నట్టు గీసిన ఈ బొమ్మల్లో కొన్ని తేడాలున్నాయి. అవెక్కడున్నాయో కనిపెట్టి సున్నాచుట్టేయండి.



కనిపెట్టండి

చిలుక నివాసం వుంటున్న ఈ చెట్టుకొమ్మపై మన ఇంట్లో వుండే కొన్ని వస్తువులు దాగున్నాయి. పక్కనున్న బొమ్మల ఆధారంగా అవెక్కడున్నాయో కనుక్కోండి.



బొమ్మల టోపీలు

పిల్లలూ ఎండాకాలం వచ్చేసింది. ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. మరి బయటికెళ్లేటప్పుడు టోపీ తప్పనిసరిగా పెట్టుకెళ్లండి. మరి మీ చిట్టి చెల్లెళ్లు తమ్ముళ్లు టోపీ పెట్టుకోమని మారం చేస్తుంటారు. అందుకే వారి కోసం రకరకాల బొమ్మలని అద్దిన టోపీలని ఎలా తయారుచేసుకోవచ్చో మేం నేర్పిస్తాం జాగ్రత్తగా మీరు వాటిని తయారుచేసేయండి....

కావాల్సిన వస్తువులు

టోపి-1(ఎరుపు రంగులో), యాక్రిలిక్ పెయింట్ (ఫ్యాబ్రిక్ పెయింట్) - నలుపు, తెలుపు రంగుల్లో, టెక్స్టైల్ పెయింట్, స్పాంజ్ -1, పెయింట్ బ్రష్-1





తయారుచేసే విధానం

ముందుగా ఒక బౌల్‌లో నలుపు రంగు యాక్రిలిక్ పెయింట్ తీసుకుని అందులో కొద్దిగా టెక్స్టైల్ మీడియం పెయింట్‌ని వేసి బాగా కలుపుకోవాలి. ఒక స్పాంజ్ ముక్కని తీసుకుని గుండ్రంగా మడిచి దాన్ని దారం లేదా బ్యాండ్‌తో కట్టాలి. ఇప్పుడు వృత్తాకారంలో వున్న స్పాంజ్ భాగాన్ని నల్లని పెయింట్‌లో ముంచి ఎరుపు రంగు టోపీపై బొమ్మలో చూపిన విధంగా అద్దాలి. ఇప్పుడు పెయింట్ బ్రెష్ (మీడియం సైజ్)ని తీసుకుని ముందుగా కలిపి పెట్టుకున్న నలుపు రంగు పెయింట్ మిశ్రమాన్ని టోపీ నుదిటి భాగంలో అద్దాలి. ఈ పెయింట్‌ని పూర్తిగా ఆరనివ్వాలి. ఇప్పుడు మరొక బౌల్‌లో కొద్దిగా తెలుపు రంగు యాక్రిలిక్ పెయింట్, టెక్స్టైల్ మిక్స్‌ని వేసి బాగా కలుపుకోవాలి. ఈ పెయింట్‌తో టోపీ నుదిటి భాగంలో బొమ్మలో చూపిన విధంగా రెండు అర్ధ చంద్రాకారాలని గీస్తే లేడీ బగ్ టోపీ తయారయినట్టే. ఇలా రంగు రంగుల టోపీలపై మీకు నచ్చిన డిజైన్‌లని అద్ది వాటిని మీ చిట్టి చెళ్ళెళ్ళు, తమ్ముళ్ళకి అందించండి.

పదవికాసం - 59

కూర్పు: రావెళ్ల

✿	1	2		✿	3	4		✿
5	✿		✿	6	✿		✿	✿
7		✿	8			✿	9	10
	✿	11	✿		✿	12	✿	
13				✿	14			
	✿		✿	15	✿		✿	
16		✿	17			✿	18	
✿	✿	19	✿		✿	20	✿	
✿	21			✿	22			✿

ఆధారాలు

అడ్డం

1. అవంతిలో దాగున్న స్త్రీ (3)
3. స్లోగన్ (3)
7. అలసి పోవు (2)
8. ఒక నక్షత్రం (3)
9. అటు నుండి గుల్మం (2)
13. బోయవాడు (4)
14. భయకంపితుడైన.. కుడి నుండి (4)
16. రాశి (2)
17. గొప్పధనం (3)
18. కొన (2)
21. కిరీటం పెట్టుకున్న అర్జునుడు (3)
22. పేపరు మామూలుగా (3)

నిలువు

2. పిచ్చి (2)
4. బొడ్డు (2)
5. దీనికి మందేస్తే ఉన్న నాలుక ఊడిందని సామెత (6)
6. మట్టి (3)
10. పొమ్మనలేక ఇది పెట్టినట్లు (6)
11. పాచి (3)
12. దర్శకరత్న ఇంటిపేరు గజిబిజిగా (3)
15. నశింపజేయడం (3)
19. గుర్రం ఎక్కి తిరగడం (2)
20. తల్లి (2)

సుడోకు

3	5					4	1	
8		2			5	9	3	6
			4					
			2				5	
7	2		8		9			4
		9	1					7
		3	9	8				
	1	6			2	8		
			5			7		

గతవారం జవాబులు

3	5	7	9	2	8	4	6	1
1	6	9	7	3	4	5	8	2
2	8	4	6	1	5	7	9	3
7	9	1	8	4	3	6	2	5
8	2	6	1	5	7	3	4	9
4	3	5	2	6	9	8	1	7
5	1	8	3	9	6	2	7	4
6	4	2	5	7	1	9	3	8
9	7	3	4	8	2	1	5	6

1 నే	✿	2 త్రో	3 వ	✿	4 వ	ర్షం	✿	5 శా
6 ల	చ్చి	✿	ర	✿	ల	✿	8 మ	ఖ
✿	9 ఋ	10 ర	ద	✿	11 చు	12 కం	శం	✿
13 సిం	✿	ది	✿	14 ఆ	✿	ద	✿	15 స
16 గా	టు	✿	17 మ	ల	చు	✿	18 సా	మీ
రం	✿	19 కా	✿	యం	✿	20 స్వ	✿	ప్జి
✿	21 వే	దు	22 క	✿	23 దు	ర్ద	24 శ	✿
25 ఆ	లు	✿	షా	✿	లు	✿	26 క్రి	27 యు
హా	✿	28 సా	యం	✿	29 పు	రం	✿	తం

అట్ట బొమ్మలులే..!

అట్టే అని తీసి పారేయకండి. మొనోమి ఓహోన్లా చక్కగా బొమ్మలు చేసుకోండి. జపాన్‌కు చెందిన మొనోమి అట్ట ముక్కలతో 3డి బొమ్మల్ని రూపొందించడంలో ఎంత సూపర్బో వీటిని చూస్తే తెలీడం లేదు. ఒసాకా కళల విశ్వవిద్యాలయంలో యానిమేషన్ నేర్చుకుందామనుకుంది మొనోమి. కానీ ఆ చదువుకు చాలా ఖర్చవుతుందని తెలిసి ఆలోచనలో పడిపోయింది. ఆ డబ్బు సమకూరే లోపున తన 3డి మోడలింగ్ నైపుణ్యాన్ని మెరుగు పరచుకోవాలనుకుంది. అప్పుడు ఎదురుగ్గా ఉన్న ఖాళీ అట్ట పెట్టెలు కనబడ్డాయి. తన చదువు గురించి ఆలోచిస్తూనే వాటిని చేతిలోకి తీసుకుని పరాగ్గా మడిచింది. కాసేపటి తర్వాత ఏదో ఆకారం తయారైంది. సాఫ్ట్‌వేర్‌కు ముందు వీటితోనే 3డి మోడలింగ్‌ను ఎందుకు నేర్చుకోకూడదు అనుకుంటూనే బోలెడు అట్ట బొమ్మలు రూపొందించేసింది. స్టార్‌వార్స్ చిత్రంలోని రోబో నుంచి ట్యాంకర్లు, రాకాసి బల్లులు, కరెన్సీ నోట్లు, బూట్లు ఇలా వైవిధ్యమైన సంక్లిష్టమైన డిజైన్లను మడిచిపెట్టేసింది. అవి అద్భుతంగా ఉండటంతో 'కార్డ్‌బోర్డ్ ఆర్టిస్ట్'గా ఆమెకు గుర్తింపు వచ్చింది.



పేదోడి వెనిస్

చూడ్డానికి వరదల్లో మునిగిపోయిన గ్రామంగా కనిపిస్తోంది కదా. ఇదేం ముంపు గ్రామం కాదు. వందలాది ఏళ్లుగా ఇలా నీటనున్న ఆఫ్రికా వెనీస్ ఇది. బెనిన్‌లోని నొకొయె సరస్సులో ఉందీ గాన్వీ గ్రామం. గినియా గల్ఫ్‌కు సమీపంలో ఉండే ఈ ఊరిలో 30 వేల మంది జనాభా దాదాపు నీటి మీద కట్టుకున్న ఇళ్లలోనే నివసిస్తారు. వెనీస్ ఎలా ఉంటుందో అలా అన్నమాట. కాకపోతే ఇవన్నీ కూడా చిన్న చిన్న షాంటీలు. ఓ రకంగా పేదోడి వెనీస్ అన్నమాట. ఒకప్పుడు వ్యవసాయం ఇప్పుడు పర్యాటకం, చేపల సాగు మీదే ఈ గ్రామం నడుస్తోంది. 16-17 శతాబ్దాల మధ్య రూపొందిన ఈ గ్రామం బానిసలది. సరస్సులోని చిన్ని చిన్ని ద్వీప సముదాయాలు, తక్కువ లోతు నీరు వల్ల కలప దుంగల్ని నిలబెట్టి వాటి మీద ఇల్లు కట్టడం సులువైంది. యునెస్కో వారసత్వ సంపద కింద కూడా నమోదైన గాన్వీలో పడవల్లోనే పక్కింటికి వెళతారు. సుమారు 3000 కట్టడాలున్న ఈ ఊళ్లో ఒకే ఒక్క స్కూల్ ఉంది. అది కూడా ఓ బుల్లి దీవంతా వాడితే కట్టగలిగారు.